

అన్నదాతలు లేని కిసాన్ మేళా
6
అధికారులు, విద్యార్థులతో నిండిన ప్రాంగణం
ప్రచారం లేకపోవడమే కారణమా!?



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి హోదాలో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు తొలిసారిగా శనివారం కందుకూరుకు వస్తున్నారు. ఈ సందర్భంగా కందుకూరు ప్రాంత అభివృద్ధికి కోసం ఆయన వరాలు కురిపిస్తారని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రధానంగా కందుకూరు నియోజకవర్గానికి మంజూరైన ఎన్నో కీలక అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తారని, నియోజకవర్గ ప్రజల ఆకాంక్షగా ఉన్న కందుకూరును తిరిగి ప్రకాశం జిల్లాలో కలపటం, కందుకూరు మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించడం వంటి సమస్యలకు కూడా చంద్రబాబు పర్యటనలో పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నారు.

కందుకూరు

కష్టాలు తీరేనా!?



• దశాబ్దాలుగా పట్టాలెక్కని పథకాలెన్నో!

కందుకూరు, (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు రిజర్వాయరు ఎడమ కాలువ విస్తరణ, పొడిగింపు పనులు మంజూరై పుష్కరకాలం దాటినా పురోగతి లేదు. 3వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణతోపాటు 4వేల ఎకరాల అదనపు ఆయకట్టుకు నీరందించేలా రూపకల్పన చేసిన ఎడమ కాలువ అభివృద్ధి పనులకు ప్రభుత్వం 2011లో మంజూరు ఉత్తర్వులిచ్చింది. భూసేకరణ, సర్వే కోసం కొంత నిధులు కూడా విడుదల చేయటంతో సర్వే, అలైన్‌మెంట్ ఖరారు ప్రక్రియ కూడా పూర్తయింది. భూసేకరణ ప్రక్రియలో కీలకమైన సామాజిక, ఆర్థిక సర్వే పూర్తిచేసినా నిధుల కొరతతో ముందుకు సాగలేదు. ఈ కాలువ అభివృద్ధి పనులు జరిగితే ఎడమ కాలువ కింద ఉన్న పెంట్రాల, చీమలపెంట, తూనుగుంట, వీఆర్ కోట గ్రామాల రైతులకు మేలు జరగటంతోపాటు కళవళ్ల, శాఖవరం, నలదలపూరు, శింగమనేనిపల్లి తదితర గ్రామాల పరిధిలో అదనపు ఆయకట్టు సాగులోకి రావటంతోపాటు శాఖవరం, నలదలపూరు చెరువుల పరిధిలో ఉన్న ఆయకట్టులో పంటల సాగుకు నీటిలభ్యతకు భరోసా ఏర్పడుతుంది. రాళ్లపాడు రిజర్వాయరుకు వర్షాధారంగా వచ్చే నీటితోపాటు సోమశిల జలాశయం నుంచి ఏటా 1.5 టీఎంసీల నీరు తెచ్చుకునేందుకు అవకాశం ఉన్న నేపథ్యంలో ఎడమ కాలువ విస్తరణ ద్వారా అతితక్కువ వ్యయంతోనే వేలాది ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించే అవకాశం ఉంది.

• ఉత్తర బైపాస్ ఎప్పటికో!?

కందుకూరు పట్టణంలో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారంగా భావిస్తున్న ఉత్తర బైపాస్ రోడ్డు కూడా మంజూరై పుష్కరకాలం గడిచినా పనులు ప్రారంభానికి నోచుకోలేదు. ఓవీ రోడ్డులో మాల్యాద్రి కాలనీ వద్ద ప్రారంభమై శ్రీనివాసకాలనీకి ఉత్తరంగా మహదేవపురం రోడ్డును క్రాస్‌చేసి జీ ప్లస్ త్రీ గృహాల సముదాయం మీదుగా ఎర్రగుంటపాలెంకు ఉత్తరంగా కోవూరు రోడ్డు క్రాస్‌చేసి కనిగిరి రోడ్డులో బాలసాయి చర్చి వద్ద కలిసి అక్కడి నుంచి విప్పగుంట రోడ్డు మీదుగా ప్రశాంతి కాలనీ పైన పామూరు రోడ్డులో కలిసేలా ఉత్తరబైపాస్‌కు అలైన్‌మెంటు ఖరారుచేశారు. ఇక్కడా సామాజిక, ఆర్థికసర్వే పూర్తిచేసి భూసేకరణకు నోటిఫికేషన్ విడుదల చేసే దశలో ఈ పనులు నిలిచిపోయాయి. కందుకూరు ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్నందున ఇప్పటికే పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ఉత్తరబైపాస్ నిర్మాణం ఆవశ్యకత ఎంతో ఉన్నప్పటికీ కార్యరూపం దాల్చడం లేదు.

• ఉద్యాన కళాశాలకు శాశ్వత భవనాల నిర్మాణం

కందుకూరు నియోజకవర్గానికి రాష్ట్ర విభజన తర్వాత ఆవిర్భవించిన తొలి టీడీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ ఉద్యాన కళాశాలను మంజూరు చేశారు. గుడ్లూరు మండలం చినలాటిరిపిలో ఈ కళాశాలను నెలకొల్పేందుకు నిర్ణయించి స్థలం కేటాయించారు. 2017-18 విద్యా సంవత్సరం నుంచి ఇక్కడ ఉద్యాన కళాశాల ప్రారంభమవగా అప్పటి నుంచి అద్దె భవనాల్లోనే నడుస్తోంది. ఓగూరు సమీపంలోని ఓ బీఈడీ కళాశాల యాజమాన్యానికి సంబంధించిన భవనాల్లో ఉద్యాన కళాశాల నడుస్తుండగా విద్యార్థినులకోసం కందుకూరులో మరో ప్రైవేటు భవనంలో వసతిగృహం నిర్వహిస్తున్నారు. చినలాటిరిపి వద్ద స్థలం ఉన్నా శాశ్వత భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు కాకపోవటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతుండటమే గాక ప్రభుత్వానికి కూడా అద్దె కోసం వ్యయమవుతోంది.

• మున్సిపాలిటీ ఎన్నికలు

కందుకూరు మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించడం కూడా కూటమి ప్రభుత్వం ముందున్న అతిపెద్ద సవాల్. 13 సంవత్సరాలుగా అధికారుల పాలన కొనసాగుతోంది. మున్సిపాలిటీలో అంతర్భాగంగా ఉన్న గ్రామాలను తొలగించటం, విలీనం చేయటం సమస్యపై కోర్టులో కేసులు పెండింగ్‌లో ఉన్న కారణంగా ఈ మున్సిపాలిటీకి ఎన్నికలు జరపటం లేదు. 2007లో చివరిసారిగా మున్సిపాలిటీ ఎన్నికలు జరిగాయి. ఆ పాలకవర్గం పదవీ కాలం 2012లో ముగియగా అప్పటినుంచి అధికారుల పాలనే సాగుతోంది. మున్సిపాలిటీకి పాలకవర్గం లేనికారణంగా అధికారుల్లో జవాబుదారీతనం లోపిస్తున్నదని, నిధుల వినియోగంలో పారదర్శకత ఉండటం లేదన్న విమర్శలూ వినిపిస్తున్నాయి. వీటన్నింటికీ తోడు కోట్లాది రూపాయలు ఆర్థికసంఘం నిధులు విడుదల కాకుండా మున్సిపాలిటీ తీవ్రంగా నష్టపోతున్నందున తక్షణం ఎన్నికలు నిర్వహించేలా ప్రభుత్వపరంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

• రూరల్ మంచినీటి పథకం

కందుకూరు రూరల్ మండలంలోని గ్రామాలలో గత కొన్ని దశాబ్దాలుగా తాగునీటి సమస్య ఉంది. పట్టణ ప్రజల దాహార్తి తీర్చడం కోసం నిర్మించిన రామతీర్థం మంచినీటి పథకం సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో సంవృద్ధిగా జలాలు ఉన్నప్పటికీ చెంతనే ఉన్న గ్రామాల ప్రజలు దాహార్తితో అల్లాడిపోతున్నారు. దీంతో రామతీర్థం సమ్మర్ స్టోరేజీ ట్యాంకు ఆధారంగా రూరల్ గ్రామాలకు కూడా మరో సీపీడబ్ల్యూ వాటర్‌స్కీం రూపకల్పనకు ఆలోచన చేసినప్పటికీ అది కార్యరూపం దాల్చలేదు. రమారమి 27 కోట్ల రూపాయల అంచనాతో రూపొందించిన ఈ మంచినీటి పథకానికి సీఎం చంద్రబాబు నిధులు మంజూరుచేయటం ద్వారా రానున్న వేసవి నాటికైనా తమ దాహార్తి తీరేలా చూడాలని రూరల్ మండలంలోని 25 గ్రామాల ప్రజలు కోరుకుంటున్నారు.



రాళ్లపాడు ప్రాజెక్టు ఎడమ కాలువ దుస్థితి



నెల్లూరు : రామ్మూర్తినగర్‌లోని కార్పొరేషన్ స్కూలు ముందు చెత్తాచెదారంతో నిండిన మురుగు కాలువ

- వైసీపీ అస్తవ్యస్థ పాలనలో రోడ్డెక్కిన చెత్త
- ఇంటింటికి చెత్త సేకరణ పేరుతో డస్ట్‌బిన్‌ల తొలగింపు
- చివరికి ఏదీ లేక ప్రజల కష్టాలపాలు
- ఆశలు రేపుతున్న కూటమి ప్రభుత్వం
- 'స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్' బృహత్తర కార్యక్రమం
- నేడు కందుకూరు నుంచి శ్రీకారం

ఏమీలేక మున్సిపల్లీలు

ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజలు పడ్డ బాధలు అన్నీ ఇన్నీ కావు. ముఖ్యంగా నగరం, పట్టణాల్లో తలెత్తిన చెత్త సమస్య ఇప్పటికీ కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. స్థానిక సంస్థల నిధులను ఇతర అవసరాలకు మళ్లించుకున్న నాటి పెద్దల తీరు కారణంగా పట్టణాలు, పల్లెలు అన్న తేడా లేకుండా పారిశుధ్యం పరిస్థితి అధ్వానంగా మారింది. పాడైన మురుగు కాలువలు బాగుచేసుకునే పరిస్థితి లేదు. కొత్త కాలువలు నిర్మించుకునే శక్తి కూడా లేక అంతర్గత రోడ్లు మురుగుకాలువలుగా మారిపోయాయి. ఇంటింటా చెత్త సేకరిస్తామని బీరాలు పలికి వీధుల్లో ఉన్న డస్ట్ బిన్‌లను తొలగించారు. ఆ తరువాత చెత్త సేకరణను గాలికి వదిలేశారు. చెత్త బండి రాక, చెత్త వేయడానికి డస్ట్ బిన్లు లేక చెత్త మొత్తం రోడ్లపైకి చేరుతోంది. ఈ పరిస్థితుల్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం దశలవారీగా పరిస్థితులను చక్కదిద్దుతోంది. 'స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్' కార్యక్రమం పేరిలో ఓ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం కందుకూరుకు వస్తున్నారు. నాటి వైసీపీ పాలనలో మున్సిపాలిటీల్లో నెలకొన్న పరిస్థితులను వివరిస్తూ 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం...

నెల్లూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని కార్పొరేషన్, పురపాలక సంఘాల్లో పారిశుధ్యం వ్యవస్థ అంతంత మాత్రంగానే ఉంది. కూటమి ప్రభుత్వంలో అధికారులు, కార్మికులు ఎంత శ్రమిస్తున్నా గత ప్రభుత్వంలో తీసుకున్న నిర్ణయాల కారణంగా ఫలితం కనిపించడం లేదు. గత వైసీపీ ప్రభుత్వం చెత్త సేకరణలో కొత్త విధానం తీసుకొచ్చింది. అయితే, అమలులో మాత్రం చేతులెత్తేసింది. నగరం, పట్టణాల్లో ఇంటింటికి వెళ్లి చెత్త సేకరించే విధానాన్ని ప్రవేశపెట్టింది. అంతేవేగంగా డస్ట్ బిన్‌లను తొలగించేసింది. అయితే, చెత్త సేకరించే వాహనాలకు అద్దె చెల్లించకపోవడంతో కాంట్రాక్టు సంస్థ ఆ వాహనాలను వెనక్కు తీసుకెళ్లిపోయింది. ఒకవైపు చెత్త సేకరణ వాహనాలు రాక, మరోవైపు ఉన్న డస్ట్‌బిన్లను తొలగించడంతో చెత్త ఎక్కడ వేయాలో తెలియక ప్రజలు నడిరోడ్డు మీద పోస్తున్నారు. కావలి, కందుకూరు, ఆత్మకూరు మున్సిపాలిటీలతోపాటు బుచ్చి నగర పంచాయతీలోనూ చెత్త వాహనాల కొరత వేధిస్తోంది. అన్ని వార్డుల్లో డోర్ టు డోర్ విధానం అమలు చేసే సామర్థ్యం వచ్చే వరకు, దీనిపట్ల ప్రజల్లో అవగాహన పెరిగే వరకు అవసరమైన చోట్ల డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయాలి.

• కార్మికుల సంఖ్య పెంచాలి

ఇక మున్సిపాలిటీల్లో పారిశుధ్య కార్మికుల సంఖ్య కూడా పెంచాల్సి ఉంది. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో ప్రస్తుతం 1200 మంది కార్మికులు ఉండగా ఇంకా 300 మంది అవసరం ఉంది. అన్ని మున్సిపాలిటీ ల్లోనూ పారిశుధ్య కార్మికుల కొరత వేధిస్తోంది. ఈ సంఖ్య పెంచుకోవడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే తప్ప సమర్థవంతంగా పారిశుధ్య నిర్వహణ సాధ్యం కాదు.

● నెల్లూరు నగరం సహా అన్ని మున్సిపాలిటీల్లో మురుగునీరు వెలుపలికి వెళ్లే అవకాశం లేదు. దీంతో కొద్దిపాటి వర్షం కురిసినా పట్టణాల్లోని రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. నెల్లూరులో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ పూర్తయితేనే ఈ సమస్య చాలా వరకు తగ్గుముఖం పడుతుంది. 2014-19లో టీడీపీ హయాంలో భూగర్భ డ్రైనేజీ పనులు 80 శాతం పూర్తి అయ్యాయి. అయితే ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పథకాల పట్ల కక్షగట్టి నిలుపుదల చేసింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ఈ పనుల్లో కదలిక వచ్చింది. వీటిని త్వరితగతిన పూర్తి చేసి, వెంకటేశ్వరపురం, అల్లీపురం, పొట్టేపాళెంలోని మురుగునీటి శుద్ధి ప్లాంట్లను వినియోగంలోకి తీసుకురావాలి. కావలి, ఆత్మకూరు, కందుకూరు మున్సిపాలిటీల్లో మురుగునీటి వ్యవస్థ నిర్వహణకు అదనపు నిధులు కేటాయించాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. పారిశుధ్యం వ్యవస్థపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడంతోపాటు మౌలికంగా అవసరమైన వనరులను కూడా సమకూర్చగలిగితే స్వచ్ఛాంధ్ర కల సాకారం అవుతుంది.

ఉదాహరణకు నెల్లూరులో రోజుకు 300 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. ఏ రోజుకారోజు ఈ చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించాలంటే సరిపడా వాహనాలు లేవు. ప్రస్తుతం కార్పొరేషన్ పరిధిలో 98 వాహనాలు, 54 ట్రాక్టర్లను అద్దెకు తీసుకొని చెత్త తరలిస్తున్నా చాలడం లేదు. ఇంకా వంద వాహనాలు అవసరం.



కందుకూరులో రోడ్డుపైకి చేరిన చెత్త

నేటి నుంచి సీబీఎస్ఈ పరీక్షలు

టెన్త్, ఇంటర్ ఒకేసారి..

హాజరుకానున్న 1782 మంది విద్యార్థులు

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) నిర్వహిస్తున్న 2024-25 వార్షిక పరీక్షలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. టెన్త్, ఇంటర్ విద్యార్థులు ఒకేసారి ఈ పరీక్షలు జరగబోతున్నాయి. దాదాపు నెలరోజులు సాగే ఈ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా టెన్త్ 1,370 మంది, ఇంటర్ 412 మంది కలిపి మొత్తం 1,782 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. కఠిన నిబంధనల నడుమ పరీక్షలను కొత్త జిల్లా ప్రాతిపదికన 8 కేంద్రాల్లో నిర్వహించేందుకు కేంద్రీయ విద్యాలయం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతిరోజూ ఉదయం 10.30 నుంచి 1.30 గంటల వరకు జరిగే పరీక్షలకు విద్యార్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు ప్రకటించారు.

• పరీక్ష కేంద్రాలు ఇవే!

నెల్లూరు నగరం కొత్తూరులోని పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయం, ఆంబర్ ఉడ్ స్కూల్, వెంకటాచలం అక్షర విద్యాలయం, కలివెలపాళెం రెయిన్‌బో స్కూల్, కావలి ఆర్ఎస్ఆర్ ఇంటర్నేషనల్ స్కూల్, జవహర్ నవోదయ విద్యాలయం, కొడవలూరు ఏకలవ్య బాలికల స్కూల్, కందుకూరు కేంద్రీయ విద్యాలయంలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. పరీక్ష కేంద్రాల్లో నిర్వహణ కు ఒక సూపర్‌వైజర్‌ను నియమించి పూర్తి బాధ్యతలు అప్పగించినట్లు అధి కారులు తెలిపారు. ప్రశ్నపత్రాలు కూడా జంబ్లింగ్ విధానంలో ఉంటాయని చెప్పారు. ప్రతి గదికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వీటిని లైవ్‌లో ఉన్నతాధికారులు తిలకిస్తుంటారని వెల్లడించారు.

సీఎం పర్యటనకు సర్వం సిద్ధం

• భారీ బందోబస్తుతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు

కందుకూరు, (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శనివారం కందుకూరుకు రానుండటంతో భారీ బందోబస్తుతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ముఖ్యమంత్రి పాల్గొనే ప్రాంతాన్ని పోలీసు అధికారులు, డాగ్‌స్క్వాడ్, బాంబ్‌స్క్వాడ్ సిబ్బంది జల్లెడపట్టి ఎక్కడికక్కడ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను పూర్తిచేశారు. స్వచ్ఛాంధ్ర -స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా దూబగుంటలో వీధులు, డ్రైనేజీలు పరిశుభ్రం చేయటంతోపాటు ఇంకుడు గుంతలను ప్రారంభించటం, పార్కు కమ్ పాండ్‌ను పరిశీలించే కార్యక్రమాలకు సీఎం హాజరుకానుండటంతో ఆ గ్రామాన్ని పూర్తిగా పోలీసు నిఘాలోకి తీసుకున్నారు.

• బహిరంగ సభకు భారీగా ఏర్పాట్లు

బహిరంగ సభ జరిగే కందుకూరు వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో కట్టుదిట్టమైన భద్రతతోపాటు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. 6వేల మందికిపైగా సభకు హాజరవుతారని అంచనా వేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సభకు వచ్చే వారంతా కూర్చుని చంద్రబాబు ప్రసంగాన్ని వీక్షించేలా ఏర్పాట్లు చేయటంతోపాటు ఎండ తగలకుండా షామియానాలు, కూలర్లు ఏర్పాటు చేస్తున్నారు. మధ్యాహ్నం 1.30 నుంచి 2.30 గంటల వరకు చంద్రబాబు బహిరంగ సభలో మాట్లాడతారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే ప్రజలు భోజనం కోసం ఇబ్బందులు పడకుండా మార్కెట్ యార్డు ఆవరణలోనే 7వేల మందికి భోజన ఏర్పాట్లు చేయిస్తున్నారు.

• ఎస్పీ దిశానిర్దేశం

సీఎం పర్యటనలో ఏ చిన్న పొరపాటు జరగకుండా పోలీసులు కట్టుదిట్టంగా వ్యవహరించాల్సిన పద్ధతిపై అధికారులు, సిబ్బందికి ఎస్పీ కృష్ణకాంత్ శుక్రవారం దిశానిర్దేశం చేశారు. ఎస్పీ, అదనపు ఎస్పీలతోపాటు 8మంది డీఎస్పీలు, 29మంది సీఐలు, 75 మంది ఎస్ఐలు, ఏఎస్ఐ లు, హెడ్‌కానిస్టేబుళ్లు 206మంది, కానిస్టేబుళ్లు 300మంది, మహిళా కానిస్టేబుళ్లు 90మంది, స్పెషల్ పార్టీ సిబ్బంది 130మంది, హోంగార్డులు 156 మంది, మహిళా హోంగార్డులు 15మందితో కలిపి మొత్తం 1060 మంది సిబ్బందితో బందోబస్తుకు ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ తెలిపారు. సీఎం బందోబస్తుకు నియమితులైన అధికారులు, సిబ్బంది అంతా శుక్రవారం ఉదయానికే పట్టణంలోని పామూరు రోడ్డులో ఉన్న ఎస్వీఎస్ కల్యాణ మండపానికి చేరుకోగా వారికి ఎస్పీ దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్ర మంలో ఏఎస్పీ మునిరాజు తదితరులు పాల్గొన్నారు.



సభా ప్రాంగణం వద్ద సూచనలిస్తున్న మంత్రి ఆనం

• ఏర్పాట్ల పరిశీలన

రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సాయంత్రం ఏర్పాట్లను పరిశీలించారు. కలెక్టరు ఓ. ఆనంద్, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ఎస్పీ కృష్ణకాంత్, ప్రకాశం జిల్లా డెయిరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు తదితరులతో కలిసి ఆయన సభాప్రాంగణాన్ని, దూబగుంట గ్రామాన్ని సందర్శించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి అసౌకర్యం కలుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన పలు సూచనలు చేశారు. అంతకుముందు సబ్ కలెక్టరు కార్యాలయంలో ఆయన వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. మరోవైపు జాయింట్ కలెక్టరు కార్తీక్, సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజ, కమిషనర్ కె. అనూష తదితరులు సభావేదిక వద్ద ఏర్పట్లను పరిశీలించారు.

సీడీపీవో బాధ్యతల స్వీకరణ

ఉదయగిరి : ఉదయగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టు ఇన్‌చార్జి సీడీపీవోగా ఎన్ సునీత శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం సకాలంలో అందేలా చర్యలు చేపట్టడంతోపాటు సమయపాలన పాటించేలా చూస్తామన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ

అల్లూరు ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాలలో ఆదర్శీల నవచేతన అంశాలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణా తరగతులు నిర్వహించారు. మూడు రోజులపాటు జరిగే శిక్షణలో కావలి సీడీపీవో సౌజన్య పాల్గొని మాట్లాడారు. అదేవిధంగా 3-6 ఏళ్ల పిల్లలకు పర్యవేక్షణ, ఆహారపు అలవాట్లు, పౌష్టికాహారం అనే అంశాలను గురించి తెలిపారు. మహిళలు, పిల్లలు వ్యక్తిగత పరిసరాల శుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రాజేశ్వరి, ఎం.కృపమ్మ తదితరులు పాల్గొన్నారు.

విలీనం వద్దని విద్యార్థుల గళం



పాఠశాల గేటు ముందు ఆందోళన చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

కలువాయిలోని వెస్ట్ ప్రాథమిక పాఠశాలను మోడల్ ప్రాథమిక పాఠశాలలో విలీనం చేయవద్దని శుక్రవారం విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. పాఠశాల గేటుకు తాళం వేసి తరగతులను అడ్డుకుని నిరసన తెలిపారు. పాఠశాల విలీనం వద్దు అంటూ నినాదాలు చేశారు. విలీనం ప్రతిపాదనలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈమేరకు ఎంఈవోకు వినతిపత్రం అందజేశారు.

- కలువాయి, (ఆంధ్రజ్యోతి)


శిథిలావస్థలో సచివాలయ భవనం



స్థానిక సచివాలయం-1 భవనం శిథిలావస్థకు చేరింది. గతంలో పంచాయతీ కార్యాలయంగా దశాబ్దాల చరిత్ర ఉంది. గత ప్రభుత్వ హయాం లో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసే క్రమంలో నగర పంచాయతీగా అల్లూరును అప్‌గ్రేడ్ చేశారు. ఈ భవనంలో సచివాలయం-1 కార్యాలయంగా మార్చారు. అయితే ఈ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. భవనంపై చెట్లు మొలిచి గోడలు పగుళ్లు ఏర్పడి శిథిలావస్థకు చేరుతున్నాయి. అధికారులు కనీసం చెట్లును తొలగించి గోడలకు పగుళ్ల లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

- అల్లూరు, (ఆంధ్రజ్యోతి)

న్యూస్ బాక్స్



సోమశిలలో 63.437 టీఎంసీల నిల్వ

అనంతసాగరం ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి శుక్రవారం 1,099 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 63.437 టీఎంసీల నిల్వ ఉంది. దిగువ కండలేరుకు 200, డెల్టాకు 2,800, ఉత్తర కాలువకు 650, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.



సంజీవయ్యకు నివాళులర్పిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

సంజీవయ్య బాటలో నడవాలి

● ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తెలుగు జాతి గర్వించదగ్గ మహనీయుడు దామోదరం సంజీవయ్య అని, ఆయన బాటలో ప్రజలు నడవాలని ఎస్పీ జీ కృష్ణకాంత్ పిలుపునిచ్చారు. సంజీవయ్య జయంతి సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

నేడు ఆత్మకూరులో మంత్రి ఆనం పర్యటన

ఆత్మకూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శనివారం ఆత్మకూరు పట్టణంలో పర్యటిస్తారని టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ఆత్మకూరులోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా సత్రం సెంటర్‌లో తడిచెత్త-పొడిచెత్త హోమ్ కంపోస్టింగ్‌పై అవగాహన కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అలఘనాథస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. అనంతరం మున్సిపల్ కౌన్సిలర్ పొడమేకల పెంచలయ్య కుమారుని వివాహ నలుగు కార్యక్రమానికి హాజరవుతారు. ఉదయం 11 గంటలకు ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్ వద్ద అటవీశాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమంలో, రవాణాశాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత నిబంధనల ప్రచార స్టిక్కర్లు వాహనాలకు ఏర్పాటుచేసే కార్యక్రమం, బాలికల గురుకుల పాఠశాలలో మినరల్ వాటర్ యూనిట్ ప్రారంభోత్సవంలో పాల్గొంటారని ఆయన తెలిపారు.

పొలాల్లో విద్యుత్ మోటార్ల చోరీ

కలువాయి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కలువాయి గ్రామ సమీపంలోని పొలాల్లో రెండు బావులకు బిగించి ఉన్న మూడు విద్యుత్ మోటార్లు, రెండు స్టాటర్లు గురువారం రాత్రి దొంగలు అపహరించారు. శుక్రవారం ఉదయం పొలానికి వెళ్లిన రైతులు కూచిపూడి నాగయ్య, రెండ్ల లక్ష్మీరెడ్డి, జమ్మన రాజారెడ్డిలు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలాన్ని ఏఎస్‌ఐ రమణయ్య పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాక్టికల్స్‌లో కాపీయింగ్ అరికట్టాలి

● కలెక్టరేట్ ఎదుట ఏఐఎస్ఎఫ్ ఆందోళన



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల్లో కాపీయింగ్‌ను అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ మస్తాన్ షరీఫ్ మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్ ప్రాక్టికల్స్ అస్తవ్యస్తంగా జరుగుతున్నాయన్నారు. కార్పొరేట్, ప్రైవేట్ కళాశా లల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి ప్రయోగ పరీక్ష ఫీజుల రూపంలో వేలాది రూపాయలు వసూలు చేశాయని, పరీక్షల సమయంలో సిబ్బందికి ముడుపులు చెల్లించి కాపీయింగ్‌కు పాల్పడుతున్నాయని ఆరోపించారు. దీని పై ఆర్‌ఐవోకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో ఇంటర్‌బోర్డు కనుసన్నల్లోనే మాస్ కాపీయింగ్ జరుగుతున్నట్లు స్పష్టమవుతోందన్నారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టిసారించాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్ అధికా రులకు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పవన్ కిషోర్, నాయకులు హనీష్, శివం వర్మ, వైభవ్, సుధీర్, శరణ్, సుమంత్, సిద్దూ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఇళ్లకు సౌర విద్యుత్ ఎప్పుడో..?

● ప్రభుత్వానికి వెళ్లిన నివేదికలు ● అమలుకు నోచుకోని పథకం

నెల్లూరు (జడ్పీ), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నిరుపేద ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా 200 యూనిట్ల విద్యుత్‌ను అందిస్తోంది. ఈ భారాన్ని తగ్గించుకునేందుకు ఎస్సీ, ఎస్టీల గృహాలకు సౌర విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం జిల్లాలోని లబ్ధిదారుల వివరాలు సేకరించి పంపాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించింది.

63 వేల గృహాలు

జిల్లాలో 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించుకునే ఎస్సీ, ఎస్టీ గృహాలు 63,079 ఉన్నాయని అధికారులు లెక్కకట్టారు. ఇందులో ఎస్సీ వినియోగదారులు 45,314, ఎస్టీలు 17,765గా తేల్చారు. ప్రతి గృహానికి 2 కిలోవాట్ సామర్థ్యం కలిగిన సౌర విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. దీనికి రూ.70 వేల మేర కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుండగా మరో రూ.50వేలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయాలని నిర్ణయించింది. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ కుటుంబాల గృహాలు, కనెక్షన్లు, నెలవారీ విద్యుత్ వాడకం వివరాలను విద్యుత్ శాఖ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. ఆ నివేదిక ప్రభుత్వానికి చేరినా తదుపరి చర్యలపై ఆదేశాలు అందకపోవడంతో ఎస్సీ ఎస్టీ కుటుంబాలకు సౌర విద్యుత్ ఏర్పాటు ఎప్పుడున్నది సందిగ్ధంగా మారింది.

విద్యుత్ డివిజన్ల వారీగా లబ్ధిదారులు

డివిజన్	ఎస్సీలు	ఎస్టీలు
నెల్లూరు సిటీ	5204	1361
నెల్లూరు రూరల్	17831	7,910
కావలి	4700	2226
ఆత్మకూరు	9,276	1729
కోవూరు	8303	4539



వందల కోట్లు ఆస్తులంటారు.. ఎక్కడున్నాయో చెప్పరు !

● మాజీ మంత్రి కాకాణిపై ఎమ్మెల్యే సోమిరెడ్డి ఆగ్రహం



కోర్టు బయట మాట్లాడుతున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : 'నెల్లూరులోని తన పార్టీ కార్యాలయంతో పాటు బెంగళూరులో విల్లా, హైదరాబాద్‌లో తన కుమార్తెకు విల్లా, సింగపూర్, మలేషియా, హాంకాంగ్‌లో మొత్తం రూ.400 కోట్లు ఉన్నట్లు మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెబుతున్నారు. అవి ఎక్కడ ఉన్నాయో చూపించాలంటే సమాధానం లేదు' అంటూ సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కృష్ణపట్నం పోర్టు స్టేషన్‌లో 2021లో నమోదైన కేసుకు సంబంధించి నిందితుడు నెల్లూరు రైల్వే కోర్టులో శుక్రవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మీడియాతో మాట్లాడారు. నా రాజకీయ ఖర్చులకు అండగా నిలిచేది నా అల్లుడేనని, అలాంటి వారికి విల్లా కొనిచ్చానని కాకాణి చెప్పటం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాకాణి అల్లుడి బినామీ కంపెనీకి 57 ఎకరాలు అప్పగించటాన్ని ఒప్పుకోరని దుయ్యబట్టారు. నెల్లూరు రూరల్ మండలంలో కాకాణి ఆక్రమించిన రూ.25 కోట్ల విలువైన భూములకు కబ్జా చెర నుంచి విముక్తి కల్పించి దళితులను అప్పగించినట్లు సోమిరెడ్డి చెప్పారు. కాకాణి నిజం మాట్లాడేందుకు మందులు వాడాలని సూచించారు.

ఎస్‌బీఐ యూనియన్స్ ఆందోళన



ఎస్‌బీఐ వద్ద నిరసన ప్రదర్శన చేస్తున్న బ్యాంక్ ఉద్యోగులు

కావలిటౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోరుతూ యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యుఎఫ్‌బీయు) ఆధ్వ ర్యంలో శుక్రవారం కోర్టు వీధిలోని ఎస్‌బీఐ వద్ద అన్నిబ్యాంకుల ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. ఈ సందదర్భంగా సంఘం నాయకులు మాట్లాడారు. వారానికి 5పనిదినాలు చేయాలని.. తాత్కాలిక ఉద్యోగులను పర్మి నెంట్ చేయాలని.. అన్ని బ్యాంకుల్లోని ఖాళీలను భర్తీ చేయాలని.. ఉద్యోగుల గ్రాడ్యూటీ రూ.25లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుఎఫ్‌బీయు నాయకులు బాబురావు, ప్రమోద్, జోస్న, కుమార్ (విశ్రాంత) భువనేశ్వరి, శ్రీనివాసులు, ప్రసాద్, కొండయ్య, కరీమ్, సాయి కృష్ణ పాల్గొన్నారు.

ఓడీఎఫ్ ప్లస్‌గా చీపినాపి గ్రామం ఎంపిక



వ్యక్తి గత మరుగుదొడ్లను పరిశీలిస్తున్న అధికారుల బృందం

కలువాయి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని చీపినాపి గ్రామ పంచాయతీని ఓడిఎఫ్ ప్లస్ (బహిరంగ మల విసర్జన రహిత గ్రామం)గా అధికారులు ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం చేజర్ల ఎంపీడీవో ఎన్ విజయలలిత, ఈవోపీఆర్డీ బి రామయ్య బృందం చీపినాపి గ్రామంలోని చెత్త నుంచి సంపద కేంద్రాన్ని, కమ్యూనిటీ శానిటేషన్ కాంప్లెక్స్, వ్యక్తిగత మరుగుదొడ్లు, వీధుల్లో పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచు జీ పెంచలయ్య, ఈవోపీఆర్డీ రమేష్ బాబు, మండల రిసోర్సు కోర్డినేటర్ పార్లపల్లి సునీల్, పంచాయతీ కార్యదర్శి శివనాగేంద్ర పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోండి


● జిల్లా సహకార అధికారి గురప్ప



ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో జిల్లా సహకార అధికారి గురప్ప

ఇందుకూరుపేట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహకారాధికారి గురప్ప తెలిపారు. మండలంలోని ఇందుకూరుపేట వ్యవసాయ సహకార సంఘంలో పరిధిలోని రైతు సేవా కేంద్రంలో శుక్రవారం ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని బయట మార్కెట్‌లో తక్కువ ధరకు విక్రయించుకోకుండా, ప్రభుత్వం కొనుగోలు కేంద్రంలో ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయించాలని తెలిపారు. ఇందుకూరుపేట సబ్ డివిజన్ పరిధిలో 35 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నామని, అందులో ఇందుకూరుపేట 12, తోటపల్లి గూడూరు 14, ముత్తుకూరు 9 కేంద్రాలు ఉంటాయన్నారు. దళారులు, మధ్యవర్తులు, రైస్ మిల్లర్లకు మాటలకు మోసపోవద్దని, ప్రభుత్వ మద్దతు ధరకంటే బయట ఎక్కువ ఉంటే విక్రయించుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వ మద్దతు ధర సాధారణ రకం క్వింటం రూ.2,300, పుట్టి రూ.19550, ఏ గ్రేడ్ రకం కింటం రూ.2,320, పుట్టి రూ.19720 ఉందని తెలిపారు. గోని సంచులు, అమాలీల చార్జీలు ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. రైతుల ఖాతాలో 24 గంటల నుంచి వారం రోజుల లోపల నేరుగా డబ్బులు జమ చేస్తారని తెలిపారు. తేమ 17 శాతం ఉండి, చెత్త, రాళ్లు లేకుండా నాణ్యత ప్రమాణాలు లోబడిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తారని తెలిపారు. ఎలాంటి సమస్యలు ఉన్నా జేసీ, డీఎస్‌వో, టోల్‌ఫ్రీ నెంబరు 1967కి ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ రాజకుమారి, ఏవో డి.రఘునాథరెడ్డి, సాగునీటి సంఘం ఉపాధ్యక్షుడు భక్తవత్సలనాయుడు, వీఏఏలు దీక్షిత, తిరుమల, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరువాసికి కొలకలూరి పురస్కారం



కొలకలూరి పురస్కారానికి ఎంపికైన స్వర్గాదపీ గరియసీ

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 14 (ఆంధ్ర జ్యోతి) : ప్రతిష్ఠాత్మకమైన కొలకలూరి సాహిత్య పురస్కారం 2025వ సంవత్సరానికి నెల్లూరీయుడైన నాటకకర్త డాక్టర్ టేకుమళ్ల వెంకటప్పయ్యకు లభించింది. వెంకటప్పయ్య రచించిన ఆధునిక సామాజిక పద్యనాటకం 'స్వర్గాదపీ గరీయసీ' ఈ అవార్డుకు ఎంపికైంది. ప్రముఖ రచయిత కొలక లూరి ఇనాక్ కుమార్తెలు డాక్టర్ కొలకలూరు మధు జ్యోతి, కొలకలూరి సుమకిరణ్ 18 సంవత్సరాలుగా సాహితీ వేత్తలకు కొలకలూరి పురస్కారాలను అందిస్తున్నారు. వీటిని మూడు విభాగాలుగా.. తమ తల్లి కొలకలూరి భాగీరథీ కవితా పుర స్కారం, నానమ్మ కొలకలూరి విశ్రాంతమ్మ నాటక పురస్కారం, తాతయ్య కొలకలూరి రామయ్య పరిశోధన పురస్కారాల పేరిట అందజేస్తున్నారు. హైదరాబాద్‌లోని పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యా లయంలో ఈనెల 26వతేదీ సాయంత్రం పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల దొంగ అరెస్టు

● 90 కిలోల రాగి తీగ, రూ.15 వేల నగదు స్వాధీనం



పట్టుబడిన నిందితుడు, స్వాధీనం చేసుకున్న రాగి తీగ, నగదుతో పోలీసులు

పొదలకూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పగలు వ్యవసాయ కూలీ పనులు, మూగజీవాలను కాచుకుంటూ.. రాత్రి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు పగులగొట్టి రాగి, అల్యూమినియం వైరు చోరీకి పాల్పడే దొంగను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఎస్‌ఐ షేక్.హనీఫ్ కథనం మేరకు.. మండలంలోని అమ్మవారిపాలెంకు చెందిన కట్టా ప్రసాద్, పొదలకూరు, నెల్లూరు రూరల్, బుచ్చి, టీపీగూడూరు, ముత్తుకూరు, వింజమూరు, వెంకటాచలం మండలాల్లోని పలు గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగి తీగను దొంగలించగా అతనిపై 27 కేసులు నమోదై ఉన్నాయి. గతంలో కొన్ని కేసుల్లో శిక్ష అనుభవించి ఉన్నాడు. ఈ నేపథ్యంలో అతనిపై నిఘా ఉంచిన పోలీసులు అమ్మవారిపాలెంలో అతనిని అరెస్టు చేసి అతని వద్ద 90 కిలోల రాగి తీగ, రూ.15వేల స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కెసు దర్యాప్తు చేస్తున్నారు.

కేంద్రానిది కార్పొరేట్ల బడ్జెట్

దీనిపై గ్రామస్థాయి నుంచి నిరసనలు ● సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు మూలం, దామా



రౌండ్ టేబుల్ సమావేశంలో సీపీఎం, సీపీఐ, న్యూడెమాక్రసీ, ఫార్వర్డ్‌బ్లాక్ నాయకులు

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో రైతాంగానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని, ఇది కార్పొరేట్ల బడ్జెట్ అని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ తీవ్రంగా విమర్శించారు. శుక్రవారం సీపీఎం జిల్లా కార్యాలయంలో వివిధ పార్టీలు, వర్గాల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులకు బడ్జెట్‌లో మొండిచేయి చూపారన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిధుల కేటాయింపులో తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. విద్య, వైద్యానికి ఎలాంటి ప్రాధాన్యత లేదన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. ఈ నెల 20న అన్ని గ్రామాల్లో ఈ నిరసనలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో న్యూడెమాక్రసీ నేత రాంబాబు, ఫార్వర్డ్‌బ్లాక్ జిల్లా కార్యదర్శి నరసింహ, సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యులు రెహనాబేగం, సూర్యనారాయణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	105
లేయర్ లైవ్	80
స్కిన్ చికెన్	194
స్కిన్‌లెస్	216
లేయర్	136

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.8242
వెండి కిలో ధర	రూ. 100,800
వెండి ఒక గ్రాము	రూ.103.80

భూ ఆధార్‌పై రైతులకు అవగాహన అవసరం

బిట్రగుంట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతుకు భూ ఆధార్‌పై అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారిని విజయలక్ష్మీ అన్నారు. బిట్రగుంట పంచాయతీలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో భూ ఆధార్ లింక్‌పై అవగాహన కల్పించారు. రైతులు వ్యవసాయ సహాయకులను సంప్రదించి ఆధార్‌కు లింక్ అయిన ఫోన్ నెంబరుతో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు తదితరులు ఉన్నారు.

పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవు

● రెవెన్యూ సిబ్బందిపై ఎమ్మెల్యే కాకర్ల ఆగ్రహం

కలిగిరి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8నెలలు దాటుతున్నా కొంతమంది అధికారులు వైసీపీ ప్రభుత్వంలో పనిచేస్తున్నట్లు కలలు కంటున్నారని, వారు తీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని ఎమ్మెల్యే కాకర్ల రెవెన్యూ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. స్థానిక టీడీపీ నాయకులతో కలిసి శుక్రవారం తహసీల్దారు కార్యాలయాన్ని తనిఖీ చేశారు. తహసీల్దారు, డీటీలు అందుబాటులో లేకపోవడంతో ఆర్ఐ అన్నపూర్ణను అడిగి పరిష్కారానికి తీసుకుం టున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన కొందరు రైతులు మాట్లాడారు. భూ సమస్యల పరిష్కా రానికి ఏడాది నుంచి తహసీల్దారు కార్యాలయం చుట్టూరా తిరుగుతున్నా ఫలితం లేదని వీఆర్వోలపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. నిర్దీత గడువులోగా భూ సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు.



రెవెన్యూ సిబ్బంది పై అసహనం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల

స్వచ్ఛమైన తాగునీరు అందించాలి

అనంతరం జలజీవన్ మిషన్ ద్వారా కలిగిరికి ఏర్పాటు చేయనున్న పైప్‌లైన్ సర్వే పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. సర్వే సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి తాగునీరు అందించేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. చివరిగా జీఓ నెం117పై జరిగిన అవగాహన సదస్సులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు పాఠశాలలను యథాస్థానంలో కొనసాగించాలని ఎమ్మెల్యేకు అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రత్యూష, ఎంఈఓ సురేష్, మెట్టుకూరు చిరంజీవిరెడ్డి, బిజ్జం కృష్ణారెడ్డి, బీవీ రామారావు, చీమల తాతయ్య, కాకు మహేష్, స్వర్ణ కొండయ్య, వెంగపనాయుడు పాల్గొన్నారు.

మద్యం దుకాణం తొలగించాలని ఆందోళన



సీఐ రమణమ్మకు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నేతలు

అనంతసాగరం ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం అనంతసాగరం బద్వేల్ రోడ్డులో పోస్టాఫీసు పక్కనే నూతనంగా ఏర్పాటుచేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలని టీడీపీ నేతలు, స్థానికులు శుక్రవారం ఆందోళన చేశారు. తొలుత పోస్టుమాస్టర్ వినయ్‌కు వినతిపత్రం ఇచ్చారు. సమాచారం అందుకున్న ఆత్మకూరు ఎక్సైజ్ సీఐ రమణమ్మ అక్కడకు చేరుకున్నారు. ఇరువర్గాల మధ్య వాగ్వివాదం చోటుచేసుకోవడంతో మద్యం దుకాణానికి సీఐ తాళం వేశారు. అనంతరం తహసీల్దారు సుభాషిణిని కలిసి మద్యం దుకాణం తొలగించాలని వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాపూరు సుబ్బారెడ్డి, ఖాసీంబాషా, మనోజ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలి

ఉదయగిరి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం గ్రామంలో ప్రస్తుతం ఉన్న వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్‌కు అదనంగా మరో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించాలని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుంటుపల్లి మాలకొండయ్యచౌదరి శుక్రవారం ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు వింజమూరులోని ఆయన క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా గుంటుపల్లి మాట్లాడుతూ ప్రస్తుతం ట్రాన్స్‌పార్మర్ ఉన్న పరిధిలో లోడ్ ఎక్కువై రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మరో 25 మోటార్లకు విద్యుత్ సరఫరా చేసే సామర్థ్యం కలిగిన అదనపు ట్రాన్స్‌పార్మర్ ఏర్పాటు చేస్తే రైతులకు ఉపయోకరంగా ఉంటుందన్నారు. ట్రాన్స్‌పార్మర్‌కు సంబంధించి నగదును డీడీల రూపంలో రైతులు విద్యుత్ శాఖకు చెల్లించారన్నారు. స్పందించిన ఎమ్మెల్యే ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి త్వరలో అదనపు ట్రాన్స్‌పార్మర్ ఏర్పాటు చేయాలని సూచించారన్నారు.

సంజీవయ్యకు ఘన నివాళి



సంజీవయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పిస్తున్న అధికారులు

సంగం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి దామోదర్ సంజీవయ్య నేటి తరం నాయకులకు ఆదర్శనీయులని ఎంపీడీవో షాలెట్ పేర్కొన్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి దామోదర్ సంజీవయ్య జయంతిని పురస్కరించుకుని కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీతి, నిజాయితీకి దామెదర్ సంజీవయ్య జీవితం నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ వరప్రసాద్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాళ్లూరి వెంకటకృష్ణయ్యకు నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

దగదర్తి, (బిట్రగుంట) ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలం కాట్రాయిపాడు టీడీపీ సీనియర్ నాయకుడు తాళ్లూరి సుధాకర్‌నాయుడు తండ్రి తాళ్లూరి వెంకటకృష్ణయ్య(75) శుక్రవారం మరణించాడు. విషయం తెలుసుకున్న కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కు టుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు పమిడి రవికుమా ర్‌చౌదరి, స్థానిక నేతలు జలదంకిశ్రీహరి, పులి శీనయ్య, కాంద్ర వెంకటేశ్వర్లు ఉన్నారు.

సాగు, తాగునీటి కష్టాలు తీర్చాలి

● రైతులు, వ్యవసాయ కూలీల ఆందోళన



బిజ్జంపల్లిలో ఆందోళన చేస్తున్న రైతులు, వ్యవసాయ కూలీలు

ఉదయగిరి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో సాగు, తాగునీటి కష్టాలు తీర్చాలని శుక్రవారం రైతు సంఘం ఆధ్వర్యంలో మండలంలోని బిజ్జంపల్లి గ్రామంలో రైతులు, వ్యవసాయ కూలీలు ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా జిల్లా రైతుసంఘం నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ రానున్న బడ్జెట్ సమావేశాల్లో వెలుగొండ, సీతారాంసాగర్, పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్లకు రూ.7 వేల కోట్ల నిధులు కేటాయించి త్వరితగతిన నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. సాగునీటి వసతి లేక పలు గ్రామాల్లో బంగారం పండే భూములున్నా బీళ్లుగా వదిలి బెంగళూరు, చెన్నై, పూణే, గోవా, తెలంగాణ తదితర ప్రాంతాలకు పొట్ట చేతపట్టుకుని వలసబాట పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మెట్ట ప్రాంతంలో సాగు, తాగునీటి కష్టాలు తీర్చాలని, లేదంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు చిన్నపరెడ్డి, ప్రసాద్, నాగయ్య, మధు, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఉదయగిరి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడినరవ గ్రామ రైతుసేవా కేంద్రంలో రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ సహకారంతో కొట్టాలపల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పర్సన్ ఇన్‌చార్జి పీ శ్రీనివాసులరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రేడ్-ఏ రకం క్వింటా రూ. 2,320, సాధారణ రకం రూ.2,300 చొప్పున మద్దతు ధరతో రైతుల వద్ద నుంచి కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవా లని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈవో పోలయ్య, సిబ్బంది సుబ్బారెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

●అల్లూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక పడమర పీఏసీఎస్ సీఈవో రాధయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ కేంద్రం అల్లూరుతో పాటు నార్త్ మోపూరు, సింగపేట రైతులకు ఉపయోగకరంగా ఉంటుం దని కేంద్రం అధికారులు తెలిపారు. రైతులు దళారుల చేతుల్లో మోసపోకుండా పండించిన ధాన్యాన్ని కేంద్రం వద్ద విక్రయించుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలకు పోషక విలువలు కలిగిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ సీడీపీఓ శర్మిష్ట తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో పోషణ బీ, పడాయి బీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జరిగిన రెండోరోజు శిక్షణలో సీడీపీఓ మాట్లాడారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సమయ పాలన పాటించి, ప్రీ స్కూల్ పిల్ల లకు ఆటపాటలతో కూడిన విద్య అందిం చాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరేంద్రదేవ్, సూపర్‌వైజర్ సునీత, సిహెచ్‌ఓ శివరామయ్య, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

● బిట్రగుంట: పౌష్టికాహార లోపంతోనే పిల్లలు, తల్లులు రక్తహీనతతో రోగాల బారిన పడుతున్నారని సూపర్‌వైజర్లు కోటేశ్వరి, సుభాషిణి తెలిపారు. విశ్వనాథరావుపేట జడ్పీహెచ్‌ఎస్ ప్రాంగణంలో నిర్వహించిన పోషణ్ బీ-పడాయి బీ శిక్షణలో వారు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సూపర్‌వైజర్ సుప్రజ, ఎంఎల్‌హెచ్‌పీలు క్రిష్ణవేణి, ప్రసన్న పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై నిరసనలకు సిద్ధమవ్వాలి:సీపీఎం

కావలి టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసనలకు సిద్ధం అవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు మాదాల వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పార్టీ పట్టణ కార్యదర్శి పెంచులయ్య అధ్యక్షతన బడ్జెట్‌కు వ్యతిరేకంగా శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కేంద్ర బడ్జెట్ కార్మికులకు కాకుండా బడా పారిశ్రామికవేత్తలకు లాభాలు చేకూర్చేలా ఉందని విమర్శించారు. విద్య, వైద్యం గురించి ప్రస్తావనే లేదని, ఉపాధి పథకానికి ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. పలు సమస్యలపై చర్చించారు. సమావేశంలో నాయకులు బలిజేపల్లి వెంకటేశ్వర్లు, సీపీఐఎంఎల్ నాయకులు లక్ష్మీరెడ్డి, కరవది భాస్కర్, సీపీఐ పట్టణ కార్యదర్శి నాగరాజు, దర్గాబాబు, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పైప్‌లైన్ మరమ్మతు పనులు

బిట్రగుంట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): దెబ్బతిన్న ప్రధాన పైప్‌లైన్లను గుర్తించి వేగవంతంగా మరమ్మతు పనులు చేపడుతున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ లీలాప్రకాశ్ తెలిపారు. శుక్రవారం ఆయన బోగోలు మేజర్ పంచాయతీలో దెబ్బతిన్న ప్రధాన పైపలైన్ పరిశీలించి మరమ్మతులు చేయించారు. రైల్వే పంప్‌హౌస్ సమీపంలోని రైల్వేట్రాక్ కింద బ్రిడ్జి (బాక్స్ టైప్ బ్రిడ్జి) వద్ద పైపులైను దెబ్బతిని ఉండటం గుర్తించారు. యుద్ధ ప్రాతిపదికన యంత్రాలు, సిబ్బందితో పనులు చేపట్టి శనివారం నీరు సరఫరా చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయనతో పాటు ఎంపీడీవో సుబ్బమణ్యం, ఏఈ శ్రీనివాసులు, ఈవోపీఆర్డీ నయీం తాజ్‌హుసన్, టీడీపీ మండల కన్వీనర్ నాగేశ్వరావు, స్థానిక నేతలు తిరుపతియాదవ్, మాకాఅర్పత్‌రాజ్, కార్యదర్శి జహీర్, జల్‌జీవన్ మిషన్ కాంట్రాక్టర్ సంజీవరెడ్డి ఉన్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాల కోసం 15 వేల దరఖాస్తులు

సంగం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాల కోసం సుమారు 15 వేల దరఖాస్తులు వచ్చాయని బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె రుణాల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఎంపీడీవో షాలెట్‌తో సమీక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ శనివారంతో దరఖాస్తు గడువు ముగుస్తుందని, ఆసక్తి కలిగిన వారు త్వరగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జనరిక్ మందుల దుకాణం కోసం రూ. 8 లక్షలు రుణం ఇస్తున్నామని అందులో రూ. 4 లక్షలు రాయితీ ఉంటుందన్నారు. ప్రతి మండలానికి ఒక జనరిక్ మందుల దుకాణం మంజూరు చేస్తున్నామన్నారు. బీఫార్మసీ, డీఫార్మసీ చేసి సర్టిఫికెట్ కలిగినవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

రాయితీ యూనిట్ల మంజూరు

ఉదయగిరి: ఉదయగిరి మండలానికి సంబంధించి మేదర, కుమ్మరి కులాలకు ఒక్కొక్కటి చొప్పున రెండు రాయితీ రుణాల యూనిట్లు మంజూరైనట్లు ఎంపీడీవో అప్పాజీ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని కార్యాలయంలో ఒక సెట్ దరఖాస్తు అందించాలని ఆయన కోరారు.

స్వచ్ఛఆంధ్రలో పాల్గొనాలి

మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీల్లో శనివారం నిర్వహించే స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగ స్వాములు కావాలని ఎంపీడీవో అప్పాజీ తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది హాజరుకావాలని ఆయన కోరారు.

పంచాయతీలో సమస్యల పరిష్కారానికి కృషి

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉప సర్పంచు కనపర్తి నారాయణమ్మ అన్నారు. శుక్రవారం గణేశ్వరాపురం సచివాలయంలో నిర్వహించిన గ్రామసభలో ఆమె మాట్లాడుతూ ప్రధానంగా తాగునీరు, వీధి దీపాలు, పారిశుధ్యం తదితర సమస్యలను గుర్తించి పరిష్కారానికి ఏకగ్రీవంగా తీర్మానించినట్లు తెలిపారు. అనంతరం టీడీపీ నాయకులు, వార్డు సభ్యులు ఆమెను ఘనంగా సన్మానించారు. అనంతరం ఇటీవల మృతిచెందిన సర్పంచు వడ్లపల్లి తిరపతయ్యకు నివాళులర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, టీడీపీ నాయకులు పేరం సుధాకర్‌రెడ్డి, కనపర్తి మహేష్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


గ్రంథాలయ నిర్మాణానికి భూమిపూజ

గుడ్లూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల అవసరార్థం స్థానిక హైస్కూల్‌లో రూ.23లక్షల అంచనా వ్యయంతో గ్రంథాలయ నిర్మాణానికి శుక్రవారం ఎంపీడీవో వెంకటేశ్వర రావు భూమిపూజ చేశారు. త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటా మన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామ్‌మోహనరావు, విద్యాకమిటీ చైర్మన్ రామిశెట్టి మహేంద్ర, పువ్వాడి వేణుగోపాల్, మేకపోతుల రాఘవయ్య పాల్గొన్నారు.

డీబీఎస్ కళాశాల వ్యవస్థాపక దినోత్సవం

కావలిటౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక మద్దూరుపాడు డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాల వ్యవస్థాక దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన పరుగు పందెం, లాంగ్‌జంప్స్ త్రోస్ తదితర క్రీడల్లో విద్యార్థులు సత్తాచాటారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆటపాటలతో అలరించారు. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరంలో అధ్యాపకులతో కలిసి రక్తదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్‌నాయుడు, ప్రిన్సిపాల్ టీవీ రావు, ఏవో రమేష్‌బాబు, పీడీ శివసాగర్ పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి



చెత్తను తొలగిస్తున్న మున్సిపల్ కార్మికులు

కావలి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పారిశుధ్య నిర్వహణకు మున్సిపాలిటీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. శుక్రవారం స్థానిక 10, 18, 34 వార్డుల్లోని గ్యాంగ్ వర్క్ పెట్టి చెత్తను తొలగిస్తూ కాలువలలో పూడిక తీయించారు. ప్రతివార్డులో నిత్యం జరిగే పారిశుధ్య పనులు మెరుగుపడక పోవటంతో చెత్త ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలి పారు. అలాగే దోమల నివారణ కోసం 2,12,13,14,18,28,34 వార్డుల్లో కాలువలలో పూడికతీత పనులు చేపట్టి మందు పిచికారీ చేయించారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు ఇద్దరు విద్యార్థినుల ఎంపిక

కొండాపురం; ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పొందేందుకు ఇద్దరు మండల విద్యార్థినులు ఎంపికయ్యారు. గొట్టిగుండాల జడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న పదర్ల గ్రేస్‌మేరీ, సాల్వ విష్ణుప్రియలతో పాటు మరికొందరు జనవరిలో జరిగిన ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష రాసినట్లు ప్రధానోపాధ్యాయుడు అమరేందర్ తెలిపారు. వీరిద్దరికీ ఇంటర్ పూర్తయ్యేవరకు ఏడాదికి రూ.12వేలు చొప్పున ఉపకారవేతనం ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ఉపాధ్యాయులు అభినందించారు.

ట్యాంకర్‌తో నీటి సరఫరా

బిట్రగుంట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీలోని యాదవపాలెం, అరుంధతివాడ ప్రజలకు శుక్రవారం మాజీ సర్పంచు దొడ్లరమణమ్మ, మాజీ ఉప సర్పంచు దొడ్ల అంజయ్య యాదవ్‌లు సొంత నిధులతో ట్యాంకర్లతో తాగునీటిని తెప్పించి సరఫరా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బోగోలు జలజీవన్ మిషన్ పథకం నుంచి గ్రామానికి నీరు సరఫరా చేసే పైప్‌లైన్ దెబ్బతినడంతో స్థానికులు దాహార్తిని తీర్చేందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దెబ్బతిన్న పైప్‌లైన్లకు వెంటనే మరమ్మతు చేపట్టాలన్నారు. ఆయన వెంట బీజేపీ మండల మహిళ అధ్యక్షురాలు నూకసాని రాజ్యలక్ష్మీ, స్థానికులు ఉన్నారు.

నేడు స్వచ్ఛఆంధ్ర.. స్వచ్ఛ దివాస్

కావలి రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని పంచాయతీల్లో శనివా రం స్వచ్ఛఆంధ్ర.. స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీదేవి శుక్ర వారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతినెలా 3వ శనివారం ఈ కార్యక్రమం చేపడతామని తెలిపారు.

కనుపూరు కాలువలో దెబ్బతిన్న తూము చెక్క గేటు

మనుబోలు మండలంలోని మెట్టప్రాంతాలకు బండేపల్లి బ్రాంచ్ వద్ద కనుపూరు కాలువ ద్వారా సాగు నీరు పారుతోంది. చివరి ఆయకట్టు గ్రామమైన జట్లకొండూరులోని రెండు చెరువులకు ఈ కాలువ గుండానే నీరు పారాలి. అయితే చెక్కలు సరిగా పని చేయకపోవడంతో నీటి సర్దుబాటు రైతులకు ఇబ్బందిగా మారింది. ఇకనైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి తూములకు కొత్త చెక్కలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. - మనుబోలు(ఆంధ్రజ్యోతి)


వేలాడుతున్న తూము చెక్క గేటు

కోతుల బెడదతో బెంబేలెత్తుతున్న ప్రజలు

రాపూరు పట్టణంలో కోతుల బెడదతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. పట్టణంలో ని పలు ప్రాంతాల్లో కోతులు విచ్చలవిడిగా సంచరిస్తూ పిల్లలు, వృద్ధులపై దాడులకు పాల్పడుతున్నాయి. ప్రజలు ఇంటి తలుపులు మూసుకుని ఇంట్లోనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. నిత్యావసర సరుకులు కొనుక్కోవడానికి వెళ్లాలన్నా భయపడుతూ వెళ్తున్నారు. ఈవిషయమై అధికారులకు సమాచారం అందించినా స్పందించడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నివాసాల మధ్య గుంపులు గుంపులుగా సంచరిస్తూ భయాందోళనకు గురిచేస్తున్నాయి. పంచాయతీ అధికారులు స్పందించి పట్టణంలో కోతుల బెడద నివారించాలని కోరుతున్నారు.

- రాపూరు(ఆంధ్రజ్యోతి)


ఓ ఇంటి గోడపై తిష్ఠవేసిన కోతుల గుంపు

ప్రజా సంక్షేమానికి ఆద్యుడు సంజీవయ్య


సంజీవయ్య చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న అరుణమ్మ, అధికారులు


సంజీవయ్యకు నివాళులర్పిస్తున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, సిబ్బంది

● జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

నెల్లూరు(జడ్పీ), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి తొలి దళిత ముఖ్యమంత్రి స్వర్గీయ దామోదరం సంజీవయ్య ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ఆద్యుడని, పరిపాలనా దక్షుడిగా ప్రజల హృదయాల్లో నిలిచిపో యారని జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ కొనియాడారు. సంజీవయ్య 104వ జయంతిని జడ్పీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. అయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ మంత్రిగా, ముఖ్యమంత్రిగా రాష్ట్రానికి సంజీవయ్య చేసిన సేవలు ఎనలేనివన్నారు. ఏసీబీని ఏర్పాటు చేసిన ఘనత అయనదేనన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో విద్యా రమ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు : నుడా చైర్మన్ కోటంరెడ్డి

నిరాడంబర జీవితాన్ని గడిపిన సంజీవయ్య అందరికీ ఆదర్శప్రాయుడని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి కొనియాడారు. సంజీవయ్య జయంతిని నుడా కార్యాలయంలో నిర్వహించారు. అయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కోటంరెడ్డి మాట్లాడుతూ నుడా పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలకుగానీ, ఏదో ఒక ప్రాజెక్టుకుగానీ సంజీవయ్య పేరు పెడతామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో నుడా కార్యదర్శి పెంచలరెడ్డి, సిటీ ప్లానింగ్ అధికారి హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ కార్యాలయంలో...

నెల్లూరు(విద్య): జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీఈవో డాక్టర్ ఆర్ బాలాజీరావు మాట్లాడుతూ రాష్ట్ర ఉన్నతికి సంజీవయ్య ఎన్నో సంస్కరణలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏసీపీ డీ వెంకట సుబ్బయ్య, సెక్టోరియల్ అధికారులు, అసిస్టెంట్ డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాంకుల కోసం ఉసురుతీస్తున్నారు

● వీబీఆర్ పాఠశాలలో విద్యార్థులపై తీవ్ర ఒత్తిడి

● విద్యార్థిని ఆత్మహత్యాయత్నంపై విద్యార్థి సంఘాల నిరసన


స్కూల్ ఎదుట నిరసనలో విద్యార్థి సంఘాలు

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చి దిద్దాల్సిన ప్రైవేట్ పాఠశాలలు ర్యాంకుల కోసం వారి ఉసురుతీస్తున్నాయని వామపక్ష విద్యార్థి సంఘాలైన ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు ఆరోపించారు. శుక్రవారం నెల్లూరు రూరల్లోని ధన లక్ష్మీపురం వద్దనున్న వీబీఆర్ స్కూల్ ఎదుట నిరసన తెలిపారు. నాయకులు మస్తాన్, షరీఫ్, నరేంద్ర మాట్లాడుతూ విద్యార్థులను ర్యాంకులు సాధించే యంత్రాలుగా తయారు చేసే క్రమంలో మితిమీరిన ఒత్తిడి తీసుకువస్తున్నారని విమర్శించారు. ఈ క్రమంలోనే వీబీఆర్ స్కూల్లో గణిత ఉపాధ్యాయుడు పదో తరగతి విద్యార్థినితో వ్యవహరించిన తీరు వల్ల సదరు విద్యార్థిని బలవన్మరణానికి యత్నించిందని చెప్పారు. ఇదే పాఠశాలలో కొంత కాలం క్రితం పదో తరగతి విద్యార్థి ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. అనుమ తులు లేకుండానే వసతి గృహాలు నిర్వహిస్తూ విద్యార్థులపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారన్నారు. కలెక్టర్, డీఈవోలు విచారణ జరిపి వీబీఆర్ స్కూల్‌పై తగు చర్యలు తీసుకోవాలని డిమాం డ్ చేశారు.

ఉపాధ్యాయుడిపై కేసు నమోదు

ఓ విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి కారణమైన వీబీఆర్ స్కూల్ ఉపాధ్యాయుడు వీరరాఘవులుపై కేసు నమోదు చేసినట్లు నెల్లూరు రూరల్ సీఐ గుంజి వేణు శుక్రవారం తెలిపారు. విద్యార్థిని బాగా చదవడం లేదంటూ ముందు బెంచీ నుంచి వెనుక బెంచీకీ మార్చడాన్ని అవమానంగా భావించిన ఆ విద్యార్థిని ఆత్మహత్యకు యత్నించిందని చెప్పారు. ఈ మేరకు అందిన ఫిర్యాదుపై దర్యాప్తు చేసి కేసు నమోదు చేశామన్నారు.

అమర జవాన్లకు నివాళి

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : పుల్వామా దాడిలో అమరులైన అమర జవాన్లకు చేయూత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వ ర్యంలో శుక్రవారం ఘనంగా నివాళులు అర్పించారు. నగరంలోని మినీ బైపాస్ రోడ్డులో ఉన్న నేతాజీ విగ్రహం వద్ద ఈ కార్యక్రమం జరిగింది. ట్రస్ట్ అధ్యక్షుడు యశ్వంత్‌కుమార్ ఆధ్వర్యంలో నేతాజీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆత్మకూరు బస్టాండు వద్ద పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సాయన్న, నందకిషోర్, కామేశ్వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గొల్లకందుకూరు పంచాయతీ కార్యదర్శిగా విజయకృష్ణ

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొల్ల కందుకూరు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పూర్తి అదనపు బాధ్యతలను విజయకృష్ణకు అప్పగించారు. ఈ మేరకు నెల్లూరు రూరల్ ఎంపీడీవో శైలేంద్రకుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం విజయకృష్ణ దొంతాలి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా కొనసాగుతుండగా గొల్లకందుకూరును అదనంగా ఆయనకు అప్పగించారు. అక్కడున్న కార్యదర్శి చెంచు కృష్ణయ్యను అదనపు బాధ్యతల నుంచి తప్పించారు.

మానవ మనుగడకు మొక్కలే ఆధారం

● వీఎస్‌యూ వీసీ విజయభాస్కర్‌రావు


మొక్కలు నాటుతున్న వీసీ విజయభాస్కర్‌రావు

వెంకటాచలం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మొక్కలు మానవ మనుగడకు ఆవశ్యకమని, అవే లేంటే మానవ మనుగడకే ప్రమాదమని విక్రమ సింహపురి యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ సారంగం విజయభాస్కర్‌రావు అన్నారు. మండలంలోని వీఎస్‌యూలో శుక్రవారం జాతీయసేవా పథకం, పినాకిని యూత్ వెల్ఫేర్ సంయుక్తంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్య అతిథిగా వీసీ పాల్గొని మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యా వరణ సమతుల్యతను పాటించడానికి తప్పని సరిగా మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ శ్యాందన్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ అల్లం ఉదయ్‌శంకర్, పినాకిని యూత్ వెల్ఫేర్ ప్రతినిధి మురళీమోహన్‌రాజు, డాక్టర్ సీహెచ్ వెంకట్రాయులు, డాక్టర్ ఎం హనుమారెడ్డి, డాక్టర్ కోటా శ్రీవల్లి పాల్గొన్నారు.

● 27 నుంచి నేషనల్ సైన్స్ డే

వీఎస్‌యూ ప్రాంగణంలో నేషనల్ సైన్స్ డేని పురస్కరించుకుని ఈనెల 27, 28వ తేదీల్లో ఓపెన్ హౌస్ వేడుకలు నిర్వహిస్తున్నట్లు వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ విజయభాస్కర్‌రావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వీఎస్‌యూలోని తన ఛాంబర్‌లో గోడపత్రికను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అవగాహన పెంచేందుకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యక్ష ప్రయోగాలు, విజ్ఞాన ప్రదర్శనలు, పోటీలు ఉంటాయన్నారు. 8 నుంచి 10వ తరగతి వరకు, డిగ్రీ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ శాస్త్రీయ అవగాహనను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, డాక్టర్ కోటనీల మణికంత, డాక్టర్ ఎం హుస్సేనయ్య, డాక్టర్ గోపాల్, డాక్టర్ సాయి ప్రసాద్‌రెడ్డి, సీహెచ్ చాముండేశ్వరి పాల్గొన్నారు.

కబ్జాదారుల నుంచి రక్షణ కల్పించండి

● తహసీల్దారుకు మహిళల ఫిర్యాదు


తహసీల్దారుకు ఫిర్యాదు చేస్తున్న మహిళలు

కోవూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కోవూరు పంచాయతీ గుమ్మళ్లదిబ్బ న్యూకాలనీలోని ప్రభుత్వ భూములను నెల్లూరు ఆదిత్యనగర్‌కి చెందిన ఇద్దరు వ్యక్తులు ఆక్రమించుకుంటున్నా రని గుమ్మళ్లదిబ్బకాలనీకి చెందిన మహిళలు శుక్రవారం స్థానిక తహసీల్దారు నిర్మలానందబాబాకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏళ్లతరబడి గుమ్మళ్లదిబ్బ న్యూకాలనీలో నివాసం ఉంటున్నామని, ఇటీవల నెల్లూరుకి చెందిన ఇద్దరు వ్యక్తులు వచ్చి అక్కడ ఉన్న ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి క్రయ విక్రయాలు చేస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా నివాస ప్రాంతంలో కోళ్ల ఫారంలను ఏర్పాటు చేయ్యటానికి ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఇలా చేస్తే తమకు ఇబ్బందులు వస్తాయని, సదరు వ్యక్తులను ప్రశ్నిస్తే తమను నానా దుర్భాషలాడి వేధింపులకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు కబ్జాదారుల చేరలో ఉన్న భూములను స్వాధీనం చేసుకుని తమకు రక్షణ కల్పించాలని కోరారు.

దామోదర్ సంజీవయ్యకు ఘన నివాళి


నివాళులు అర్పిస్తున్న ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది

రాపూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రెండో ముఖ్యమంత్రి దామోదర్ సంజీవయ్య జయంతి సందర్భంగా మండల ప్రజారిషత్ కార్యాలయంలో ఎంపీడీవో భవానీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు దందోలు వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు కొండలపూడి రాఘవరెడ్డి, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన


పెనుబల్లి గిరిజన కాలనీలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై మండలంలోని పెనుబల్లి గిరిజనకాలనీలో రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) సీఎఫ్ఎల్ ఆధ్వర్యంలో కళాకారులు ఆట పాటలతో పొదుపు మహిళలు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఐ సీఎఫ్ఎల్ కోఆర్డినేటర్ సతీష్, కౌన్సిలర్లు సుమన్, రూపేష్, వెలుగు వీవోఏలు అమ్మణ్ణి, శైలజ, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

ఎన్ఎంయూఏలో వైఎస్ఆర్ యూనియన్ సభ్యుల చేరిక


వైఎస్ఆర్ఈఏ నుంచి ఎన్ఎంయూఏలో చేరిన వారితో పట్టాభి రామిరెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలోని వైఎస్ఆర్ ఎంప్లాయీస్ అసోసియేషన్‌కు చెందిన 20 మంది సభ్యులు శుక్రవారం ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ) లో చేరారు. నగరంలోని ఆర్టీసీ ప్రధాన బస్టాండులోని ఎన్ఎంయూఏ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. నెల్లూరు-2 డిపో వైఎస్ఆర్ ఎంప్లాయీస్ అసోసియేషన్‌కు చెందిన సీహెచ్ హరికిషోర్, ఎం సురేష్, ఏ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో 20 మంది ఎన్ఎంయూఏలో చేరారు. వారికి ఎన్ఎంయూఏ జిల్లా గౌరవాధ్యక్షుడు, పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో డిపో కమిటీ అధ్యక్షుడు యూఎంకే రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడు డీఎంకే రెడ్డి, కార్యదర్శి పీ సునీల్‌బాబు, గ్యారేజ్ కార్యదర్శి సునీల్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి పీఎస్ రెడ్డి, మాజీ ఆర్గనైజింగ్ కార్యదర్శి కే రమణరాజు, తదితరులు పాల్గొన్నారు.

అన్నీ పాఠశాలలను కొనసాగించాలి

● డీఈవోకు యూటీఎఫ్ వినతి


డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల పునర్వవస్థీకరణలో భాగంగా అన్ని పాఠశాలలు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ నాయకులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో శుక్రవారం డీఈవో డాక్టర్ ఆర్ బాలాజీరావుకు శుక్రవారం వినతిపత్రం అందచేశారు. బేసిక్ ప్రాథమిక పాఠశాలలను కొనసాగించడంతో పాటు మోడల్ ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేయాలని సూచించారు. 60 మంది విద్యార్థులున్న ప్రాథమికో న్నత పాఠశాలలను ఉన్న త పాఠశాలలుగా మార్పు చేయాలన్నారు. ఉర్దూ మీడియం పాఠశాలలను కూడా అప్‌గ్రేడ్ చేసి యథావిధిగా కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు వీవీ శేషులు, జీవీ చలపతిశర్మ, కార్యదర్శులు కే నాగిరెడ్డి, ఎస్‌కే ఖాజావలి, ఎన్ రమణయ్య, నాయకుడు ఎస్‌కే జమీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

సాగు, తాగునీటి కష్టాలు తీర్చాలి

● రైతులు, వ్యవసాయ కూలీల ఆందోళన

ఉదయగిరి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో సాగు, తాగునీటి కష్టాలు తీర్చాలని శుక్రవారం రైతు సంఘం ఆధ్వర్యంలో మండలంలోని బిజ్జంపల్లి గ్రామంలో రైతులు, వ్యవసాయ కూలీలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా రైతుసంఘం నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ రానున్న బడ్జెట్ సమావేశాల్లో వెలుగొండ, సీతారాంసాగర్, పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్లకు రూ.7 వేల కోట్ల నిధులు కేటాయించి త్వరితగతిన నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. సాగునీటి వసతి లేక పలు గ్రామాల్లో బంగారం పండే భూములున్నా బీళ్లుగా వదిలి బెంగళూరు, చెన్నై, పూణే, గోవా, తెలంగాణ తదితర ప్రాంతాలకు పొట్ట చేతపట్టుకుని వలసబాట పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మెట్ట ప్రాంతంలో సాగు, తాగునీటి కష్టాలు తీర్చాలని, లేదంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు చిన్నపరెడ్డి, ప్రసాద్, నాగయ్య, మధు, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లోనే రాజకీయాలు

రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : రాజకీయాలు ఎన్నికల సమయాల్లోనే చేయాలని, మిగిలిన సమయమంతా అభివృద్ధి చేయాలంటూ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం 29వ డివిజన్ గాంధీనగర్ వద్ద రూ.20 లక్షలతో నిర్మించిన పార్కును ఆయన ప్రారంభిం చారు. నియోజకవర్గంలో రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి జరగాలని ఆకాంక్షించారు. ప్రజలెవరైనా సమస్యలపై ఫోన్ చేస్తే స్పందించేందుకు తాను, తన సోదరుడు గిరిధర్‌రెడ్డి 24 గంటలు అందుబాటులో ఉంటామని చెప్పారు. కాగా, కొండ్లపూడి గ్రామంలో రూ. 35 లక్షల విలువ చేసే అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి చేపట్టిన గడప గడప కార్యక్రమం శుక్రవారం మాదరాజు గూడూరులో జరిగింది. ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. సమస్యలు తెలుసుకున్నారు.


పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి

వెంకయ్య స్వామి ఆశ్రమంలో మహా ధుని

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : శివరాత్రి మహోత్సవం సందర్భంగా పొదలకూరురోడ్డులోని సివిల్ సప్లయిస్ గోదాము వెనుక ఉన్న భగవాన్ వెంకయ్యస్వామి ఆశ్రమంలో మహాధుని ఏర్పాటు చేస్తున్నామని ఆశ్రమం నిర్వాహకుడు ఆనందయ్య తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 50 టన్నుల కట్టెలతో మహా ధుని (యజ్ఞం) నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ నెల 26వతేదీ శివరాత్రి సందర్భంగా ఉదయం 7గంటలకు వెంకయ్యస్వామికి ప్రత్యేక పూజలు, 9 నుంచి 11గంటల వరకు మహా ధుని, 12.30గంటలకు అన్నదానం, రాత్రి 7గంటల నుంచి సత్సంగంతో శివరాత్రి జాగారణ ప్రారంభమవుతుందని తెలిపారు.

ఆరోగ్యం కోసం ఆటలు ఆడాలి

● నెహ్రూ యువ కేంద్ర కో ఆర్డినేటర్ మహేందర్

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : చిన్నారులను ఆరోగ్యం కోసం ఆటలాడించాలని నెహ్రూ యువకేంద్ర కో ఆర్డినేటర్ ఏ మహేందర్ సూచించారు. శుక్రవారం పొదలకూరురోడ్డులోని వియానీ హోంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చిన్నారిలో మానసిక ధైర్యం, శారీరక ఆనందం కలిగించేవి ఆటలే అని తెలిపారు. నిరాశ, నిస్పృహలకు లోనుకాకుండా క్రీడల్లో ముందుకు సాగాలని దివ్యాంగ బాలలను కోరారు. చదువుతోపాటు ఆటల్లో నైపుణ్యం కలిగిన వారు ఉన్నత స్థాయికి చేరుకుంటారని, జ్ఞాపకశక్తి పెరుగుతుందని చెప్పా రు. వియానీ హోం సేవలను ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా చిన్నారులకు క్రీడా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అవినాష్, హోం డైరెక్టర్ సిస్టర్ రమా, జయప్రకాష్, సిస్టర్ మ్యాగీ, పీఆర్వో జయ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

గుండె నొప్పికి ఉచితంగా ఇంజక్షన్

వెంకటాచలం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అబిసాహెబ్ కండ్రిగ గ్రామానికి చెందిన 60 ఏళ్ల బాబు శుక్రవారం తీవ్ర గుండెనొప్పితో బాధపడుతూ వచ్చారు. దీంతో వెంటనే అప్రమత్తమైన సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పరుశురాం, డాక్టర్ జీ గాయత్రిలు తమ వైద్య బృందంతో కలిసి వైద్య పరీక్షలు నిర్వహించారు. గుండెనొప్పితో బాధపడుతున్న బాబుకు వెంటనే రూ.40వేల ఇంజక్షన్ ఉచితంగా వేశారు. దీంతో 10 నిమిషాల్లోనే బాధితుడికి నొప్పి తగ్గిపోయింది. డాక్టర్ పరుశురాం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా పేదల గుండెకు చంద్రన్న భరోసా కార్యక్రమాన్ని చేపట్టిందని, అందులో భాగంగానే తీవ్ర గుండెనొప్పితో బాధపడుతూ సీహెచ్‌సీకి వచ్చిన బాబుకు రూ.40 వేలు చేసే ఇంజక్షన్‌ను ఉచితంగా వేసి ప్రాణాలను కాపాడినట్లు తెలిపారు.

దుర్గాదేవికి మహా చండీయాగం

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : బుచ్చిరెడ్డిపాళెంలోని దుర్గానగర్‌లో కొలువైవున్న దర్గాదేవికి శుక్రవారం అమ్మవారి జన్మ(మూలా)నక్షత్రం సందర్భంగా ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు కత్తుల చెంగలరాయుడు ఆధ్వర్యంలో మహా చండీ యాగం వైభవంగా జరిగింది. ముందుగా భక్తులు 108 కలశాలతో తెచ్చిన జలాలతో ఆలయ ప్రదక్షిణ చేసి అమ్మవారికి అభిషేకం చేశారు. ముందుగా గణపతి పూజ, హోమం అనంతరం మహా చండీ యాగం నిర్వహించారు. వందల సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించు కుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది.

రైతు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

సైదాపురం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రైతు రిజిస్ట్రేషన్ తప్పని సరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయశాఖాధికారి హైమావతి శుక్రవారం తెలిపారు. మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రం వద్ద శనివారం ఉదయం 8గంటల నుంచి రైతు రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతుందన్నారు. పట్టాదారు పాస్‌బుక్, వన్‌బీ అడంగళ్, ఆధార్‌కార్డు, ఫోన్ నెంబర్‌తో రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగించుకోవాలన్నారు.

రేపు పద్మశాలి సంఘం సమావేశం

నెల్లూరు(వ్యవసాయం), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): చేనేతల సమస్యల తోపాటు పద్మశాలీల ఆర్థిక స్థితిగతులపై చర్చించేందుకు ఆదివారం పొదలకూరులో పద్మశాలి సంఘం సమావేశం నిర్వహిస్తున్నట్లు పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు బుధవరపు బాలాజీ పేర్కొన్నారు. నెల్లూరులోని లస్సీ సెంటర్‌లో శుక్రవారం ఆ సంఘం నాయకుల సమావేశం జరిగింది. బాలాజీ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల నుంచి పద్మశాలీలు పాల్గొని వారి సమస్యలను తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతగింజల సుబ్రహ్మణ్యం, జిల్లా గౌరవాధ్యక్షుడు నందం అశ్వద్ధామ, వర్కింగ్ ప్రెసిడెంట్ సోమ గోపాల్, పొదలకూరు మండల నాయకుడు చొప్పు వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకట రమణయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణ

పొదలకూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం అంగన్‌వాడీ వర్కర్లకు పోషణ్ బీ - పఢాయ్ బీ కార్యక్రమంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖాధికారిణి రేణుక పాల్గొని మాట్లాడుతూ బాలికలను అన్ని రంగాల్లో చైతన్యవంతులను చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఎం.జ్యోతిలక్ష్మి, డి.పద్మజ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

వైసీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కోవూరు నియోజకవర్గం పరిధిలో 21 వైసీపీ అనుబంధ విభాగాలకు నూతన అధ్యక్షులను వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవ ర్ధన్‌రెడ్డి నియమించినట్లు మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

వీఓఏ, సీసీలకు శిక్షణ

రాపూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంఘమిత్ర కార్యాలయంలో వీఓఏలకు, సంఘమిత్ర సీసీలకు లోకోస్ యాప్‌పై శిక్షణ తరగతులు లోకోస్ యాప్ స్పోక్స్ పర్సన్ చిన్నయ్య నిర్వహించారు. ప్రతి పొదుపు సంఘంలో ఆర్థిక లావాదేవీలను వీఓఏలు, సీసీలు పర్యవేక్షించాలన్నారు. దేశవ్యాప్తంగా త్వరలో ర్యాంకింగ్ విధానాలను ప్రవేశ పెట్టబోతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం రాధా రెడ్డి, వీఓఏలు, సీసీలు పాల్గొన్నారు.



ఇది ఇంతేనా!?

ఈ ఫొటోలోని విరిగిన విద్యుత్ స్తంభం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం. మనుబోలు మండలం బండేపల్లి జగనన్న లేఅవుట్‌లో లాగిన విద్యుత్ వైర్లకు రోడ్డు పక్క ఓ విద్యుత్ స్తంభం సగానికి విరిగిపోయి సపోర్టు స్తంభంతో వేలాడుతోంది. ఈ లేఅవుట్ సమీపంలో ఉన్న ఓ ఫ్యాక్టరీకి వచ్చిన లారీ మలుపుతిప్పే క్రమంలో ఈ స్తంభాన్ని ఢీకొంది. దీంతో ఇది దెబ్బతినింది. ఇది జరిగి నెలలు గడుస్తున్నా విద్యుత్‌శాఖ అధికారులు పట్టించుకోలేదు. దీంతో ఏ క్షణమైనా స్తంభం పడిపో తుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

- మనుబోలు(ఆన్‌లైన్)

ముగిసిన ఆదికేశవస్వామి బ్రహ్మోత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని నవాబుపేట ఉడయవర్లు దేవస్థానంలో శ్రీదేవి, భూదేవి సమేత ఆదికేశవస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ముగిశాయి. చివరి రోజు ఉదయం స్వామి, అమ్మవార్ల జరిగిన ప్రణయ కలహోత్సవం (మునుగుల సేవ) వేడుక భక్తులకు కనువిందు చేసింది. అనంతరం చక్రస్నానం శాస్త్రోక్తంగా జరిగింది. పలువురు భక్తులు పుణ్యస్నానాలు చేశారు. సాయంత్రం ధ్వజావరోహణం అనంతరం ద్వాదశ ఆరాధన, ఏకాంతసేవ నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా శ్రీరంగం నుంచి శ్రీరంగం భట్టర్ స్వామి విచ్చేసి భక్తులకు ఆదికేశవ స్వామి బ్రహ్మోత్సవ విశేషాలను వివరించి, మంగళా శాసనాలు చేశారు. ఈ కార్యక్రమాలను ఆలయం చైర్మన్ పల్లా ప్రోలు శ్రీరామకృష్ణమాచార్యులు పర్యవేక్షించారు.

ఉద్యాన శాఖ నర్సరీలో 19న బహిరంగ వేలం

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్లోని గుడిపల్లిపాడు వద్దనున్న ఉద్యాన శాఖ నర్సరీలో 77 కొబ్బరి, 7 పనస, 75 జామ, 60 మామిడి చెట్ల ఫలసాయము హక్కులను పొందేందుకు ఈ నెల 19వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ ఏడీ ఎంవీ సుబ్బారెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పాల్గొనదలచిన వారు రూ.500 ధరవతు చెల్లించాలని, హక్కులు పొందిన వారికి కాలపరిమిత ఈ ఏడాది డిసెంబరు 31 వరకు ఉంటుందన్నారు.

వృథా నీటిని అరికట్టేదెవరు!?



మండలకేంద్రంలోని 4వ వార్డులో పబ్లిక్ కుళాయిలు ఏర్పాటు చేయక పోవడంతో రాళ్లపాడు రక్షిత తాగునీటి పథకం నీరు వృథా అవుతోంది. అలాగే గ్రామంలోని బీసీ కాలనీ, ఎస్సీ కాలనీ, పెద్దబజారు, జెండాచెట్టువీధి, మంగళపాలెం చిన్నపాలెం తదితర కాలనీల్లో కూడా పబ్లిక్ కుళాయిలు ఏర్పాటు చేయలేదు. సంబంధిత పంచాయతీ పాలకులు, అధికారులు పట్టించుకోక పోవడం వలనే ఈ సమస్య నెలకొందని స్థానికులు ఆరోపిస్తున్నారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- వలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి)



రాళ్లపాడు ప్రాజెక్టు

'రాళ్లపాడు'ను పట్టించుకోండి!

లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గంలోని మూడు మండలాలు, ఉదయగిరి నియోజక వర్గంలోని ఒక మండలంలోని వేలాది మంది రైతులకు సాగు, తాగునీటికి జీవనాధారం రాళ్లపాడు ప్రాజెక్టు. ఇంత ప్రాధాన్యత ఉన్న ఈ ప్రాజెక్టుకు ఏళ్ల తరబడి సమస్యలు తిష్ఠ వేశాయి. ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో అధికారికంగా 15వేల ఎకరాలు, అనధికారికంగా మరో 10వేల ఎకరాలు మొత్తం 25వేల ఎకరాల్లో వరి సాగు అవుతుంది. అలాగే వేసవిలో పత్తి పైరు సాగు చేస్తారు. దీని ఆధారంగా మూడు భారీ మంచినీటి పథకాలను నీరు సరఫరా చేస్తుండటంతో 100కు పైగా గ్రామాల ప్రజల గొంతుతడుపుతోంది. గత వైసీపీ ప్రభుత్వం ప్రాజెక్టు అభివృద్ధిని పట్టించుకోలేదు.

● పూడికతీత పనులు చేపట్టలేదు.

40 ఏళ్ల నుంచి ప్రాజెక్టులోని పూడికతీత పనులు చేపట్టలేదు. పూడికను తొలగించాలంటే స్పిల్‌వేలోని రెండు పూడు గేట్లను ఆపరేట్ చేయాల్సి ఉంది. వాటిని ఆపరేట్ చేసి చాలాఏళ్లు గడిచింది. అలాగే కొత్త స్పిల్‌వేలోని 5గేట్లలో ఒక గేటు ఏడాది నుంచి పని చేయడం లేదు. అలాగే ఈ గేట్ల వద్ద స్టాప్ గేట్లను ఏర్పాటు చేయలేదు. అయితే ఈ రెండు స్పిల్‌వేల నుండి 2.50 లక్షల క్యూసెక్కుల వరద నీటిని మన్నేరుకు విడుదల చేయవచ్చు. కానీ ప్రస్తుతం కేవలం 1.20 లక్షల క్యూసెక్కులు విడుదల చేసే అవకాశం ఉంది. అంతకు మించి వరద నీరు వస్తే ప్రాజెక్టుకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

● వేధిస్తున్న సిబ్బంది కొరత

ప్రాజెక్టులో అధికారులు, సిబ్బంది కొరత ఏళ్ల తరబడి వేధిస్తోంది. వాస్తవానికి ఒక ఈఈ, ఇద్దరు డీఈలు, 10 మంది జేఈలు, లస్కర్లు, అటెండర్లు, వాచ్‌మెన్లు, ఎలక్ట్రీషియన్లు, జనరేటర్ ఆపరేటర్లు 30మంది వరకు ఉండాలి. ప్రస్తుతం ప్రాజెక్టులో ఇద్దరు డీఈలు, ఇద్దరు జేఈలు, డిప్యూటేషన్‌పై వచ్చిన ఇద్దరు లస్కర్లు మాత్రమే ఉన్నారు. సిబ్బంది కొరతతో కుడి, ఎడమ కాలువలపై నీటి పర్యవేక్షణ కష్టంగా మారింది. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రాజెక్టు సమస్యలను సీఎం చంద్రబాబుకు వివరించి నిధుల మంజూరుకు చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

● 'సోమశిల నీరు వచ్చేనా!?

రాళ్లపాడు ప్రాజెక్టు ఆయకట్టు రైతులను ఆదుకొనేందుకు ఏర్పాటు చేసిన సోమశిల ఉత్తర కాలువ నుండి ప్రాజెక్టుకు నీరు సరిగా రావడం లేదు. సోమశిల ప్రాజెక్టు నుండి 1.5టీఎంసీల నీరు వచ్చేలా 106కి.మీ పొడవునా కాలువను నిర్మించారు. అయితే కాలువ నిర్మాణం పూర్తయిన తరువాత ఏడాది కూడా ప్రాజెక్టుకు 0.25 టీఎంసీల నీరు కూడా రాడం లేదు. 300 క్యూసెక్కుల నీరు వచ్చేలా కాలువను వెడల్పు పనులు సోమశిల మొదటి నుండి సుమారు 30కి.మీ మేర పనులు జరిగాయని తరువాత పనులు నిలిపివేవారు. ఈ పనులు పూర్తయితే కేవలం నెల రోజులలోనే ప్రాజెక్టు నిండుతుందని అధికారులు చెబుతున్నారు.

కిసాన్‌మేళాలో రైతులేరీ!?

● అధికారులు, విద్యార్థులతో నిండిన ప్రాంగణం ● అయినా అధిక శాతం కుర్చీలు ఖాళీ

● ప్రచారం లేకపోవడమే కారణమా!?

నెల్లూరు (వ్యవసాయం), ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): నెల్లూరు వ్యవసాయ పరిశోధనా స్థానంలో శుక్రవారం జరిగిన కిసాన్ మేళా రైతుల తాకిడి లేక వెలవెల పోయింది. సభా ప్రాంగణం ముందు వ్యవసాయ, అనుబంధ రంగ సంస్థల అధికారులు, శాస్త్రవేత్తలు, పలు సంఘాల నాయకులు, మత్స్య కళాశాల, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు, అరాకొరా రైతులతో కుర్చీలు నిండాయి. సగానికిపైగా ప్రాంగణం బోసిపోయింది. దీంతో సభాధ్యక్షులు పదేపదే రైతులందరూ వచ్చి కూర్చోవాలని, స్టాళ్ల నిర్వాహకులు కూడా సభలో కూర్చోవాలని పదేపదే మైకులో చెప్పినా లాభం లేకుండాపోయింది. కిసాన్ మేళాపై పెద్దగా ప్రచారం లేకపోవడమే ఇందుకు కారణమని కొంతమంది భావిస్తున్నారు. ముఖ్యమంత్రి పర్యటన ఉండటంతో జిల్లా ఉన్నతాధికారులు దాదాపుగా హాజరుకాలేదు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి మినహా పెద్దగా చెప్పుకునే నాయకులూ రాలేదు.

● సమస్యలపై ఏకరువు

ఈ సందర్భంగా కొంతమంది రైతులు, రైతు సం ఘాల నాయకులు పలు సమస్యలను ఎమ్మెల్యేతోపాటు శాస్త్రవేత్తల దృష్టికి తీసుకొచ్చారు. రైతు సంఘం నాయకుడు గంగపట్నం రమణయ్య మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో 30ఏళ్లుగా ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. తేమ శాతం పేరుతో ఎక్కువ కేజీలు ధాన్యం తీసుకుంటున్నారని చెప్పారు. అంతేగాక కొన్నేళ్లుగా కొత్త రకం వంగడాలు వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు రైతులకు ఎందుకు అందుబాటు లోకి తీసుకురాలేకపోయారో చెప్పాలని ప్రశ్నించారు. అదేవిధంగా బీజేపీ కిసాన్ మోర్చా నాయకడు వేమిరెడ్డి సురేంద్ర మాట్లాడుతూ జిల్లాకు దాదాపు 30 డ్రోన్లను ప్రభుత్వం మంజూరు చేసిందని అయితే వాటిని గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన సంఘాలకు కాకుం డా నూతన సంఘాలకే ఇచ్చేలా చూడాలని చెప్పారు. విచ్చలవిడిగా పురుగు మందుల వాడ కం వల్ల పండించిన పంట విషంగా మారుతోందని దీనిపై రైతులకు అవగాహన కల్పించాలని పలువురు రైతులు శాస్త్ర వేత్తల దృష్టికి తీసుకొచ్చారు.



సభా ప్రాంగణంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

● 22 శాతం వరకు కొనుగోళ్లకు అనుమతి ఇప్పించండి

ధాన్యం సేకరణలో తేమ శాతం 17 నుంచి 22వరకు కొనుగోళ్లు జరిగేలా అనుమతి ఇప్పించాలని రైతు సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కోటిరెడ్డి ఎమ్మెల్యే సోమిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ధాన్యం నగదుతో పాటు హమాలీ కూలీల చార్జీలు, రవాణా చార్జీలు కూడా కలిపి రైతుల ఖాతాలకు జమ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య నాయకులు ఏవీఆర్ నాయుడు, ఎం.మాల కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మద్దతు ధరపై ప్రత్యేక దృష్టి

● 2, 3 రోజులకోసారి అధికారులతో మాట్లాడతా
● ఏవైనా సమస్యలుంటే తెలపండి.. ప్రభుత్వంతో నేరుగా చర్చిస్తా
● సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి
● వివిధ స్టాళ్లతో ఆకట్టుకున్న కిసాన్ మేళా



స్టాల్‌లో వ్యవసాయ పరికరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

నెల్లూరు (వ్యవసాయం), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : రైతులకు మద్దతు ధర అందుతోందా లేదా అన్నదానిపై రెండు, మూడు రోజులకు ఒకసారి అధికారులతో తాను చర్చించనున్నట్లు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. నెల్లూరు వ్యవసాయ పరిశోధన స్థానంలో శుక్రవారం ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో కిసాన్ మేళా జరిగింది. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన సోమిరెడ్డి సభలో మాట్లాడారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. రైతు సంక్షేమం కోసం గత తెలుగుదేశం పార్టీ హయాంలో తీసుకొచ్చిన పథకాలను వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింద న్నారు. వ్యవసాయ సీజన్లలో పంటలకు అవసరమైన నీరు అందించకపోగా కనీసం కాలు వల్లో పూడికలు కూడా తీయించలేదని విమర్శించారు. రాజకీయాలకు అతీతంగా రైతులకు సేవ చేయాల్సిన బాధ్యత ప్రతి రాజకీయ నాయకుడిపై ఉందన్నారు. అధికారులు కూడా రైతులకు చిత్తశుద్ధిగా సేవలందించాలని సూచించారు. రైతుల సమస్యలతోపాటు వ్యవ సాయ అనుబంధ శాఖల సమస్యలు తన దృష్టికి తీసుకొస్తే ప్రభుత్వంతో నేరుగా మాట్లాడేందుకు తానెప్పుడు సిద్ధంగా ఉంటానని హామీ ఇచ్చారు. తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహ సంచాలకురాలు డాక్టర్ వీ సుమతి మాట్లాడుతూ నూతన సాంకేతిక పరిజ్ఞానంపై రైతులకు అవగా హన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవ సాయ విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్సలర్ దామోదర్ నాయుడు మాట్లాడుతూ ఏవైనా కొత్త వెరైటీలు సాగు చేసే ముందు శాస్త్ర వేత్తలు, వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు పాటించా లని రైతులకు సూచించారు. తెగుళ్లపై అవగాహన పెంచుకోవాలని అప్పుడే సాగులో ఖర్చులు తగ్గుతాయన్నారు. నెల్లూరు వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త వినీత, జిల్లా వ్యవసాయాధికారి పి.సత్య వాణి, జిల్లా ఉద్యా నశాఖ అధికారి సుబ్బారెడ్డి తదితరులు మాట్లాడారు. పొదలకూరు వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్ర మంలో తిరుపతి, గుంటూరు వ్యవసాయ పరిశోధనా స్థానాల శాస్త్రవేత్తలు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాళ్లు ఆకట్టుకున్నాయి.

వీర జవాన్లకు నివాళి



వాలంటైన్స్ డే వాల్‌పోస్టులను దహనం చేస్తున్న ఏబీవీపీ విద్యార్థులు

సంగం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పుల్వామా దాడిలో వీర మరణం పొందిన వీర జవాన్లకు శుక్రవారం స్థానిక నేతాజీ జూనియర్ కాలేజీలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించారు. అనంతరం వాలెంటైన్స్ డే మన సంస్కృతి కాదని వాల్ పోస్టర్లను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ సంగం శాఖ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విలీన సభలో తీర్మానం ప్రకటిస్తున్న నేతలు

విద్యార్థి ఉద్యమాలు చేపట్టాలి

● ఏఎన్‌యూ ప్రొఫెసర్ అబ్దుల్ నూర్‌బాషా

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటీకరణ, అసంబద్ధ విద్యావిధానాలకు వ్యతిరేకంగా బలమైన విప్లవ విద్యార్థి ఉద్యమాలు చేపట్టాలని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ అబ్దుల్ నూర్‌బాషా పిలుపునిచ్చారు. నెల్లూరులోని అనిత హాలు సమావేశ మందిరంలో శుక్రవారం పీడీఎస్‌యూ సంస్థల విలీన సభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యారంగ పరి రక్షణకు దేశంలోని ప్రగతిశీల విప్లవ విద్యార్థి సంఘాలన్నీ ఏకం కావాల్సిన అవసరం ఉంద న్నారు. విద్యార్థులు, మేధావులు సంఘటితంగా పోరాడితేనే విద్యా విధానంలో మార్పులు వస్తా యని తెలిపారు. పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పీ ప్రసాద్ మాట్లాడుతూ ఒకేదేశం, ఒకే పరీక్ష పేరుతో జాతీయ ప్రవేశ పరీక్షల్లో భారీగా అవకతవకలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అనంతరం కమిటీ సభ్యులంతా విద్యారంగ పరిరక్షణకు ఏకగ్రీవంగా తీర్మానాలు చేసి వాటిని సాధించే వరకు పోరాడతామని ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ రాజశేఖర్, ప్రధాన కార్యదర్శులు ఎం వినోద్‌కుమార్, కే భాస్కర్, అరుణోదయ రాష్ట్ర అధ్యక్షుడు జాలన్న, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి పద్మ, సీపీఐఎంఎల్ నేత సాగర్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సునీల్, నాయకులు పాల్గొన్నారు.



అలగాయపాలెంలో సమావేశమైన తీరప్రాంత ప్రజలు

తీరప్రాంత ప్రజల ప్రత్యేక సమావేశం

బీపీసీఎల్ ప్రతిపాదితపై ఆందోళన

ఉలవపాడు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక అభివృద్ధి పేరుతో తీరప్రాంతం గ్రామాలను నామరూపాలు లేకుండా చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని రామాయపట్నం, పెదపట్టపుపాలెం, చాకిచర్ల, కరేడు ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. బీపీసీఎల్ కంపెనీ ఏర్పాటులో భాగంగా శుక్రవారం వారు అలగాయపాలెంలో సమావేశమై చర్చించారు. కరేడు తీరప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తే రామాయపట్నం పోర్టు నిర్వాసితులకు జరిగిన అన్యాయమే మాకు జరుగుతుందని వాపోయా రు. ఏడాదికి రెండు పంటలు పండే భూములు ఇవ్వడానికి సిద్ధంగా లేమన్నారు. ఈ విషయాన్ని శనివారం కందుకూరుకు వస్తున్న సీఎం దృష్టికి తీసుకెళ్లాలని సమావేశంలో తీర్మానం చేశారు. ప్రతి గ్రామంలో కమిటీ ఏర్పాటు చేసి జాయింటి యాక్షన్ కమిటీతో సీఎంకు వినతిపత్రం అందచేద్దామని సమావేశంలో నిర్ణయించారు.

ముగిసిన రోడ్డు భద్రత మాసోత్సవాలు

డ్రైవర్ కృష్ణయ్యకు రాష్ట్ర మొదటి స్థానం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో ఆర్టీసీ నెల్లూరు-2వ డిపో గ్యారేజీలో రోడ్డు భద్రత మా సోత్సవాల ముగింపు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. సంస్థ ఆర్ ఎం మురళీబాబు మాట్లాడుతూ మాసోత్సవాల్లో భాగంగా డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు రక్త దానం.. తదితర కార్యక్ర మాలు నిర్వహించామని చెప్పారు. అనంతరం ప్రమాద రహిత ఉత్తమ డ్రైవర్లను సత్కరించారు. రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచిన నెల్లూరు-2వ డిపో డ్రైవర్ కృష్ణయ్యకు రూ.2500 నగదు బహుమతి ప్రదానం చేశారు. జిల్లాలో మొదటి స్థానంలో నిలిచిన నెల్లూరు-1 డిపో డ్రైవర్ ఎస్‌కే రఫీకి రూ.2000, కందుకూరు డిపోకు చెందిన సీహెచ్‌పీ రావుకు రూ.1500, నెల్లూరు-2 డిపోకు చెందిన ఎస్‌కే ఖయ్యూమ్‌కు రూ.1000 చొప్పున నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీటీఎం షేక్ షమీమ్, నెల్లూరు-1, నెల్లూరు-2 డీఎంలు మురళీకృష్ణ, శివకేశవ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిన డ్రైవర్ కృష్ణయ్యను సన్మానిస్తున్న ఆర్టీసీ అధికారులు

రేపు మంత్రి నారా లోకేష్ రాక

వెంకటాచలం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈనెల 16వ తేదీన వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌కు రానున్నారు. మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు మనుమడు, స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ యిమ్మణి దీప, వెంకట్ రావుల కుమారుడు విష్ణుకు ఇటీవల సాత్వికతో మహాబలిపురంలో వివాహం జరిగింది. కాగా నెల్లూరులోని ఆత్మీయుల కోసం ఆదివారం రిసెప్షన్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి నారా లోకేష్ విజయవాడ నుంచి తిరుపతి విమానాశ్రయానికి, అక్కడి నుంచి రోడ్డు మార్గాన వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌కు ఉదయం 10.45 గంటలకు చేరుకుని వారిని ఆశీర్వదించ నున్నారు. అనంతరం మధ్యాహ్నం 11.45 గంటలకు రోడ్డుమార్గాన బయలుదేరి తిరుపతి విమానాశ్రయానికి చేరుకొని అక్కడి నుంచి హైదరాబాద్‌కు వెళ్లనున్నారు.



విజయరాణి

ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా విజయరాణి

నెల్లూరు (హరనాథపురం) ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ జిల్లా ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా ఐ విజయరాణి నియమితులయ్యారు. ప్రస్తుతం ఆమె రిజిస్ట్రేషన్ శాఖ ఆర్‌వో కార్యాలయంలో జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌గా కొనసాగుతున్నారు.

ఐటీఐలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు

నెల్లూరు(విద్య), (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వెంకటేశ్వరపురం ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ పేరుతో కంప్యూటర్ కోర్స్‌లో ఉచితంగా మూడు నెలల శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ కే శ్రీధర్ రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణ పూర్తయిన తరువాత జిల్లాలోని వివిధ పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలు కూడా కల్పించేందుకు అవకాశం ఉందన్నారు. ఆసక్తి కలిగిన యువత సోమవారం కళాశాలలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9494456326, 9704510793 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

అలల తాకిడికి మత్స్యకారుడి మృతి



నాగరాజు మృతదేహం

ఉలవపాడు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారుడు అలల ఉధృతికి ప్రాణం విడిచిన సంఘటన శుక్రవారం తెల్ల వారుజామున అలగాయపాలెం సముద్ర తీరంలో చోటు చేసుకుంది. బంధువులు, పోలీసులు తెలిపిన మేరకు.. కరేడు పంచాయతీ అలగాయపాలెం గ్రామానికి చెందిన వాయల నాగరాజు(47) బోటు మీద కాకుండా సము ద్రంలో కొంతదూరం ఈత కొట్టుకుంటూ కెరటాలకు అవల వైపున తనతో పాటు తీసుకెళ్లిన వలలతో వెళ్లాడు. వాటిని వదిలే క్రమంలో భారీ కెరటాలకు తీసుకెళ్లిన చేపల వల చుట్టుకోవడంతో ఈత కొట్టలేని పరిస్థితుల్లో నీటిలో మునిగి మృతి చెందాడు. అలలకు ఒడ్డుకు కొట్టుకొచ్చిన మృతదేహాన్ని ఉదయం గ్రామస్థులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడికి భార్య బుజ్జమ్మ, కూతురు, కొడుకు ఉన్నారు. ఎస్ఐ అంకమ్మ సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిమిత్తం మృతదేహాన్ని సీహెచ్‌సీకి తరలించి కేసు నమోదు చేశారు.

బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

● నేటి నుంచి రెండో విడత ప్రాక్టికల్స్
● ఆర్‌ఐవో డాక్టర్ శ్రీనివాసులు

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆర్‌ఐవో డాక్టర్ ఏ శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం నెల్లూరులోని ఇంటర్‌బోర్డు కార్యాలయంలో చీఫ్, అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్లతో ఆయన సమీక్ష జరిపారు. రెండో విడత ప్రాక్టికల్స్ శనివారం నుంచి జరుగుతాయన్నారు. పరీక్షల నిర్వహణపై అనేక ఆరోపణలు, అపోహలు వస్తున్న నేపథ్యంలో కట్టుదిట్టంగా నిర్వహించాల్సిన కర్తవ్యం అందరిపై ఉందన్నారు. ఈ సమావే శంలో డీవీఈవో మధుబాబు, డీఈసీ సభ్యులు పీ వేణుగోపాల్, కే కొండయ్య, సీహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌ఐవో

కామాక్షితాయికి సామూహిక కుంకుమార్చన

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో శుక్రవారం కామాక్షితాయికి సామూహిక కుంకుమార్చన వైభవంగా జరిగింది. అనంతరం అమ్మ వారి ఉత్సవమూర్తిని పల్లకిలో కొలువుదీర్చి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు. ఉదయం ఆలయంలో గంగా, కామక్షితాయి సేమత మల్లికార్జునస్వామి నిత్య కల్యాణోత్సవం జరిగింది. అధిక సంఖ్యలో ఆలయానికి వచ్చిన భక్తులు స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు.


స్వర్ణముఖి నది వంతెన పక్కనే విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు

ముసిలిపేడు వంతెనకు చేటు!

వాళ్ల కంటికి కనిపించేది ఇసుక.. దీని అక్రమ రవాణాతో వచ్చే డబ్బు మాత్రమే. ఈ క్రమంలో ఎవరికి.. దేనికి నష్టం వాటిల్లినా పట్టించుకోవడం లేదు. ఇలా.. ఇసుకాసురులు ముసిలిపేడు వద్ద స్వర్ణముఖి నది వంతెన కిందా ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్నారు. దీనివల్ల వంతెన దెబ్బతింటుందని స్థానికులు ఆందోళన.. అభ్యంతరం వ్యక్తంచేస్తున్నా లెక్క చేయడంలేదు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

- రెచ్చిపోతున్న ఇసుకాసురులు
- యథేచ్ఛగా స్వర్ణముఖి నదిలో ఇసుక తవ్వకాలు

ఏర్పేడు మండలం ముసిలిపేడు వద్ద స్వర్ణముఖి నదిపై భారీ వంతెన ఉంది. శ్రీకాళహస్తి మండలం తొండమనాడు నుంచి ముసిలిపేడు మీదుగా పాపానాయుడుపేట వరకు సుమారు 100 గ్రామాలకు ఇదే ప్రధాన మార్గం. ఈ వంతెన సమీపంలో శ్మశానమూ ఉంది. గత వైసీపీ పాలనలో ఈ వంతెన సమీపంలో ఇష్టారాజ్యంగా అక్రమార్కులు ఇసుక తవ్వకాలను సాగించారు. రాత్రి వేళల్లో నదిలోకి దిగి ఇసుక తవ్వి బయట ప్రాంతాలకు తరలించారు. దీంతో స్థానిక రైతులు భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయంటూ గగ్గోలు పెట్టారు. అలాగే వంతెన సమీపంలో ఇసుక తవ్వకాలు జరిగితే పెనుముప్పు సంభవిస్తుందన్న ఆవేదనతో న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో రెండేళ్ల క్రితం ముసిలిపేడు వంతెనకు ఇరువైపులా 500 మీటర్ల మేర ఎక్కడ ఇసుక తవ్వకాలు జరిగినా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను న్యాయస్థానం ఆదేశించింది. దీంతో స్థానికులు అప్పటినుంచి తరచూ ఇసుక తవ్వకాలను అడ్డుకుంటున్నారు. రెండు సంవత్సరాల క్రితం ఇసుక తవ్వకాలు జరగకుండా వైసీపీకి చెందిన ఇసుకాసురులను ముసిలిపేడు వద్ద తరిమికొట్టారు. 5 నెలల క్రితం మళ్లీ వంతెన సమీపంలో తవ్వకాలు ఆరంభం కావడంతో 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీంతో కొంత కాలం పాటు వంతెన వద్ద ఇసుక తవ్వకాలు ఆగాయి. మళ్లీ నెల రోజులుగా వంతెన పక్కనే ఉన్న బాట నుంచి నదిలోకి ట్రాక్టర్లు దిగి ఇసుక తరలించడం ప్రారంభమైంది. గతంలో రాత్రి వేళల్లో గుట్టు చప్పుడు కాకుండా తవ్వేవారు. ప్రస్తుతం పగలు, రాత్రి అన్న తేడా లేకుండా ఎంతో ధీమాగా.. వంతెన కిందనే తవ్వకాలు సాగిస్తున్నారు. పగటిపూట మనుషులతో, రాత్రిపూట యంత్రాలతో తోడేస్తున్నారు. ఇక్కడి నుంచి శ్రీకాళహస్తి, రేణిగుంట, తిరుపతి, చంద్రగిరి, చెన్నైలకు భారీ ఎత్తున ఇసుక తరలిస్తున్నారు. ఈ నిర్లక్ష్య వైఖరి మరికొద్ది రోజులు పాటు కొనసాగితే వంతెనకు చేటు తప్పదని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆ వంతెనకే దిక్కులేదు

ఏర్పేడు మండలం పాపానాయుడు పేట వద్ద స్వర్ణముఖి నదిపై ఓ వంతెన మూడేళ్ల క్రితం వరద తీవ్రతకు కొట్టుకుపోయింది. ఇప్పటికీ అక్కడ కొత్త నిర్మాణానికి అడుగు పడలేదు. ముసిలిపేడు వద్ద ఉన్న కీలకమైన వంతెన దెబ్బతింటే వంద గ్రామాలకు రాకపోకలు ఇబ్బందిగా మారతాయి. ఇక, పరివాహ ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటుతాయని రైతులూ ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా అధికారులు అక్రమ ఇసుక తవ్వకాలను అరికట్టడంతో పాటు వంతెనకు భద్రత కల్పించే అంశంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



5కే వాక్‌థాన్

జంక్‌ఫుడ్ మానండి. మంచి ఆహారం తీసుకోండి. వ్యాయామం చేయండి. బాల్యం నుంచే ఆటలాడండి. మెరుగైన జీవన విధానం అలవరచుకోండి. తద్వారా క్యాన్సర్ రాకుండా నివారించొచ్చంటూ అధికారులు అవగాహన కల్పించారు. ప్రపంచ క్యాన్సర్ డే సందర్భంగా తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 5కే వాక్‌థాన్, సైకిల్‌ర్యాలీ నిర్వహించారు. ముందుగానే గుర్తించి తగిన చికిత్సతో క్యాన్సర్‌ను జయించవచ్చన్నారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి



బడుగు వర్గాల ఆశాజ్యోతి సంజీవయ్య

బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి పాటుపడిన ఆదర్శప్రాయుడు మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య అని కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. దామోదరం సంజీవయ్య 104వ జయంతి వేడుకలను శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, జేసీ శుభంబన్సల్, అదనపు ఎస్పీ రవిమనోహరాచారి, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మ, విక్రమ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- తిరుపతి(కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ముగ్గురికి రెండు రోజుల జైలు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): అతిగా మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జ్యుడిషియల్ న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పునిచ్చారు. ఈ ముగ్గురినీ గతంలో ఒకటికి రెండుసార్లు హెచ్చరించినా లెక్క చేయకుండా మళ్లీ మళ్లీ ట్రాఫిక్ పోలీసుల తనిఖీల్లో దొరికారు. ఈ క్రమంలో సత్యసాయి జిల్లా ధర్మవరానికి చెందిన బయన్న, తిరుపతి రిక్షాకాలనీకి చెందిన నందగోపాల్, తిరుమల బాలాజీనగర్‌కు చెందిన కుమార్‌కు రెండు రోజుల చొప్పున జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. అలాగే, డ్రంకెన్ డ్రైవ్ కేసులో 12 మందిపై ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేశారు. ఒక్కొక్కరికి రూ.పది వేల వంతున రూ.1.20 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.


వెటర్నరీ వర్సిటీ పరిపాలనా భవనం

'అగ్రి' వర్సిటీల వీసీల నియామకాలకు గ్రీన్‌సిగ్నల్

- తొలగిన న్యాయ అడ్డంకులు
- యూజీసీ నిబంధనల ప్రకారం భర్తీకి హైకోర్టు తీర్పు
- వెటర్నరీ వీసీ పోస్టుకు పలువురు ఆశావహులు

తిరుపతిరూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వ్యవసాయ అనుబంధ వెటర్నరీ, ఉద్యానవన వర్సిటీలలో రెగ్యులర్ వీసీ పోస్టుల భర్తీకి ఎదురైన న్యాయపరమైన అడ్డంకులు తొలగిపోయాయి. గత వైసీపీ పాలనలో నిబంధనలు ఉల్లంఘిస్తూ నోటిఫికేషన్, ఇంటర్వ్యూలను నిర్వహించకుండానే వెటర్నరీ, వ్యవసాయ వర్సిటీలకు తిరిగి మూడేళ్లపాటు వీసీలను పునర్నియమించేందుకు చొరవచూపారు. అప్పటికే నిబంధనలకు విరుద్ధంగా 2023 జూన్‌తో మూడేళ్ల పదవీకాలం ముగిసిన వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ వీసీ డాక్టర్ జానకిరామ్‌ను మరో మూడేళ్లు వీసీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీన్ని అవకాశంగా చేసుకుని అప్పట్లో వెటర్నరీ, వ్యవసాయ వర్సిటీ వీసీలుగా పనిచేసే డాక్టర్ వి.పద్మనాభరెడ్డి, డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి తమనూ మరో మూడేళ్లు కొనసాగించాలని విన్నవించారు. దీనిపై పలువురు ప్రొఫెసర్లు అభ్యంతరం చెప్పినా అప్పటి పాలకులు లెక్కచేయని పరిస్థితి. దీనిపై పలువురు ప్రొఫెసర్లు న్యాయస్థానాల దృష్టికి తీసుకెళ్లారు. పునర్నియామక నిబంధనలపై హైకోర్టు ప్రభుత్వాన్ని స్పష్టత కోరడంతో వీసీల నియామకాలకు అప్పట్లో బ్రేక్‌పడింది. ఏడాదిన్నర కాలం తర్వాత అగ్రివర్సిటీల వీసీల నియామకాలను యూజీసీ నిబంధనల ప్రకారం చేపట్టాలని గతనెల 6న రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం(హైకోర్టు) తీర్పు వెలువరించింది. ఈ తీర్పుతో వీసీ పదవి కోసం ఆశగా ఎదురుచూస్తున్న ఆశావహ ప్రొఫెసర్లలో మళ్లీ ఆశలు చిగురించాయి. ప్రభుత్వం ఎప్పుడు నోటిఫికేషన్ జారీ చేస్తుందా అని ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. కాగా, కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రంలో ఇన్‌చార్జులున్న 17 వర్సిటీల్లో వీసీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసి, సెర్చ్ కమిటీలనూ నియమించింది. ఈ క్రమంలో త్వరలో 'అగ్రి' వర్సిటీల వీసీ పోస్టుల భర్తీకి జీవో, నోటిఫికేషన్‌ని జారీచేసి.. నియామక ప్రక్రియ పూర్తి చేయాలని అధ్యాపక, ఉద్యోగవర్గాలు కోరుతున్నాయి.

ఇక్కడంతా ఇన్‌చార్జులే

వెటర్నరీ వర్సిటీలో వీసీ పోస్టుతో పాటు కీలకమైన రిజిస్ట్రార్, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్(డీఆర్), డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్(డీఈ), డెయిరీ డీన్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈఈ), కంప్ట్రోలర్ వంటి పోస్టులలో ఇన్‌చార్జి అధికారులే కొనసాగుతున్నారు. కాగా, రెగ్యులర్ ఆఫీసర్ పోస్టుల్లో డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్(డీఎస్ఏ)గా ఉన్న ప్రొఫెసర్ డాక్టర్ జేవీరమణ ఇన్‌చార్జి వీసీగా వ్యవహరిస్తుండగా.. వెటర్నరీ డీన్, సీఈఈ పోస్టులలో రెగ్యులర్ అధికారులు కొనసాగుతున్నారు. రెగ్యులర్ వీసీ నియామకం జరిగితే వర్సిటీ ఆఫీసర్ల రిక్రూట్‌మెంట్ చేసుకునే అవకాశం ఉంటుందని వర్సిటీ ఉద్యోగ వర్గాలు అంటున్నాయి.

ఈసీ, వీసీ లేక పాలన అస్తవ్యస్తం

ఎస్వీ వెటర్నరీ వర్సిటీకి 2022 అక్టోబరు 31వ తేదీతో పాలకమండలి గడువు ముగిసింది. రెగ్యులర్ వీసీగా పనిచేసిన డాక్టర్ పద్మనాభరెడ్డి పదవీకాలం 2023 ఆగస్టు 4తో ముగిసింది. అప్పటి నుంచి పూర్తిస్థాయిలో ఈసీ, రెగ్యులర్ వీసీలు లేక పాలన అస్తవ్యస్తంగా మారింది. ఇప్పటి వరకు ఇన్‌చార్జి వీసీతో కలిపి ఏడుగురు ఎక్స్‌అఫిషియో సభ్యులతో ఈసీని నిర్వహించి, గతేడాది వరకు పలు నిర్ణయాలను ఆమోదించారు.2024 డిసెంబరు 31న ఎక్స్‌అఫిషియో సభ్యులలో ఒకరు పదవీ విరమణ పొందారు. దీంతో ఇప్పుడు ఈసీకి కోరం కూడా లేదు. ఈ పరిస్థితుల్లో పాలనాపరమైన అవసరాల కోసం రూ.కోట్లాది నిధులను మంజూరు చేస్తూ రాటిఫికేషన్ పెట్టుకుంటున్నారు. ఇది నిబంధనలకు విరుద్ధమని వర్సిటీ వర్గాలు అంటున్నాయి. రూ.10లక్షలకు మించి మంజూరుకు బోర్డు అనుమతి తప్పనిసరిగా ఉండాలంటున్నారు.అలాగే ఈ నెల 3 నుంచి వర్సిటీ పరిధిలోని 36మంది అధ్యాపకులకు(అసోసియేట్, ప్రొఫెసర్, సీనియర్ ప్రొఫెసర్) సీఏఎస్ పదోన్నతుల ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. వీరికీ బోర్డు అనుమతితోనే ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంది. పాలసీ నిర్ణయాలు, నియామకాలు, బడ్జెట్, సివిల్‌పనులు, ఉద్యోగుల డిసిప్లినరీ ప్రొసీడింగ్స్‌పదోన్నతులు వంటివి బోర్డులో పెట్టి ఆమోదం పొందాల్సి ఉంటుంది. 2022 నవంబరు ఒకటి నుంచి వర్సిటీకి పూర్తిస్థాయి ఈసీ లేకుండా పాలన సాగిస్తున్న పరిస్థితి.

టీటీడీ ఇళ్ల పట్టాల్లో జగన్ బొమ్మ మాకెందుకు?

- ఉద్యోగుల్లో అసంతృప్తి
- శ్రీవారి బొమ్మతో కొత్తవి ఇచ్చే యోచనలో టీటీడీ

తిరుపతి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఇటు పక్క తిరుమలలోని ఆనంద నిలయం, వేంకటేశ్వరస్వామి ఫొటో. అటువైపు జగన్ బొమ్మ చుట్టూ నవరత్నాల పేరుతో అందిస్తున్న పథకాలను ముద్రించారు. ఇదీ గత వైసీపీ ప్రభుత్వంలో టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలను కేటాయిస్తూ ఇచ్చిన ప్రొసీడింగ్స్ కాపీలోని చిత్రాలు. ఇలా, శ్రీవారితో సమానంగా అప్పటి సీఎం జగన్ ఫొటో ముద్రించడం తీవ్ర విమర్శలకు తావిచ్చింది. అయినా అప్పటి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి పట్టించుకోలేదు. తమ ఇళ్ల పట్టాలకు సంబంధించి ప్రొసీడింగ్స్ కాపీపై జగన్ బొమ్మ ఎందుకంటూ టీటీడీ ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తంచేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక.. ఉద్యోగుల విజ్ఞప్తి మేరకు జగన్ బొమ్మను తీసేసి శ్రీవారి ఫోటోను ముద్రించి పాత ప్రొసీడింగ్స్ స్థానంలో కొత్తవి ఇచ్చే యోచనలో టీటీడీ ఉన్నట్లు తెలుస్తోంది. గతేడాది సార్వత్రిక ఎన్నికలకు ముందు వడమాలపేట మండలం పాదిరేడు అరణ్యం గ్రామంలోని 417.16 ఎకరాల వ్యవసాయ భూమిలో టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలను కేటాయించారు. 5,350 మంది ఉద్యోగులకు ప్రొసీడింగ్స్ ఇచ్చారు. వీటిపై అప్పటి సీఎం జగన్ బొమ్మను ముద్రించడంపై విమర్శలు వచ్చాయి. పట్టాల పంపిణీని అడ్డుకునేందుకు సిద్ధమైన టీడీపీ నేతలను అప్పట్లో పోలీసులు హౌస్ అరెస్టు కూడా చేశారు. గతంలో అనేకసార్లు టీటీడీ ఉద్యోగులకు ఇంటి పట్టాలు ఇచ్చినా.. ఎన్నడూ నేతల ఫొటోలు ముద్రించలేదు. కానీ, వైసీపీ హయాంలో సొమ్ము టీటీడీది, సోకు నాయకులది అన్న చందంగా వ్యవహరించారు. ప్రభుత్వం నుంచి తాము భూమి కొనుగోలు చేశామని, ఉచితంగా ఇవ్వలేదని, అలాంటప్పుడు ప్రొసీడింగ్స్‌పై జగన్ బొమ్మ ఎందుకని టీటీడీ ఉద్యోగులు గతంలోనే బాహాటంగా ప్రశ్నించినా పట్టించుకోలేదు. ఎన్నికల్లో లబ్ధిపొందేందుకే అప్పటి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి జగన్ బొమ్మలు ముద్రించారని విపక్షాలు ఆరోపించాయి. ఇప్పుడా జగన్ బొమ్మలను తొలగించి, శ్రీవారి ఫొటోలతో కొత్తగా ప్రొసీడింగ్స్ ఇచ్చే ఉద్దేశంతో టీటీడీ ఉన్నట్లు సమాచారం.


TIRUMALA TIRUPATI DEVASTHANAMS
TIRUPATI, ANDHRA PRADESH.

Office of the Executive Officer,
T.T. Devasthanams, Tirupati.
Roc.No.TTD-24021(80)/2/2021 WO-SEC
Date.28-12-2023

"PROCEEDINGS"

Sub: TTD - Allotment of House Plots to Employees Under "OWN YOUR HOUSE SCHEME" at Padiredu Aranyam Village, Vadamalapeta Mandal, Tirupati District – Orders – Issued – Regarding.

కల్తీ నెయ్యి కేసులో నిందితులకు రుయాలో వైద్య పరీక్షలు



తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కల్తీ నెయ్యి కేసులో నిందితులైన రాజశేఖర్, పోమిల్‌జైన్, అపూర్వ, విపిన్‌జైన్‌కు శుక్రవారం సిట్ అధికారులు రుయాస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించారు. వీరిని సిట్ కస్టడీకి న్యాయస్థానం అనుమతించిన నేపథ్యంలో అలిపిరి, వెస్ట్ సీఐలు రామకిశోర్, మురళీమోహన్ వైద్య పరీక్షల నిమిత్తం 11.30 గంటలకు రుయా అత్యవసర విభాగానికి తీసుకొచ్చారు. సీఎంవో అన్వేష్ ఆధ్వర్యంలో నిందితులకు వైద్య పరీక్షలు నిర్వహించి అందరూ ఆరోగ్యంగా ఉన్నట్లు నిర్ధారించారు. తిరిగి 11.50 గంటలకు తీసుకెళ్లారు.



స్వచ్ఛాంధ్ర మిషన్‌లో 13వ ర్యాంకు

200 పాయింట్లలో 111 సాధించిన జిల్లా

తిరుపతి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా పట్టణాభివృద్ధి శాఖ, పంచాయతీరాజ్ శాఖలు చేపట్టిన స్వచ్ఛాంధ్ర మిషన్‌లో జిల్లాకు 13వ ర్యాంకు దక్కింది. స్వచ్ఛాంధ్ర మిషన్ అమలు తీరుపై శుక్రవారం సీఎం చంద్రబాబు సమీక్షించారు. సంబంధిత కార్యక్రమాల అమల్లో జిల్లాలు సాధించిన ర్యాంకులను ప్రకటించారు. పట్టణాలు, నగరాలు, గ్రామ పంచాయతీల పరిధిలో ఇంటింటి నుంచి చెత్త సేకరణ, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, పబ్లిక్ టాయిలెట్లు, కమ్యూనిటీ సోక్‌పిట్స్, ఓడీఎఫ్ ప్లస్ మోడల్ తదితర 14 ప్రాధాన్యతాంశాలను తీసుకున్నారు. వీటన్నింటికీ కలిపి 200 పాయింట్లు నిర్ణయించారు. ఇందులో జిల్లాలు సాధించిన పాయింట్లను బట్టి ర్యాంకులు ప్రకటించారు. 26 జిల్లాలతో కూడిన ఈ జాబితాలో తిరుపతి జిల్లా 111 పాయింట్లతో 13వ స్థానంలో నిలిచింది. మొదటి ర్యాంకు సాధించిన ఎన్టీయార్ విజయవాడ జిల్లాకు 129 పాయింట్లు రాగా దానికీ తిరుపతి జిల్లాకు నడుమ తేడా 18 పాయింట్లు కావడం గమనార్హం. రాయలసీమ విషయానికొస్తే 122 పాయింట్లతో అనంతపురం జిల్లా మొదటి స్థానంలోనూ, 120 పాయింట్లతో అన్నమయ్య జిల్లా రెండో స్థానంలోనూ, 118 పాయింట్లతో కడప జిల్లా మూడో స్థానంలోనూ నిలవగా తిరుపతి జిల్లా నాలుగో స్థానంలో నిలిచింది. మిగిలిన సత్యసాయి, నంద్యాల, చిత్తూరు, కర్నూలు జిల్లాలు మరింత వెనుకబడ్డాయి.

మీకు అండగా ఉంటాం

● ఏనుగు దాడిలో మృతిచెందిన రాకేష్ కుటుంబానికి మంత్రి లోకేశ్ భరోసా



చంద్రగిరి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఏనుగు దాడిలో మృతిచెందిన చంద్రగిరి మండలం మామిడిమానుగడ్డ వాసి, కందులవారిపల్లె పంచాయతీ ఉపసర్పంచ్ రాకేష్‌చౌదరి కుటుంబానికి అండగా ఉంటామని మంత్రి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు. రాకేష్ కుటుంబ సభ్యులు శుక్రవారం ఉండవల్లి నివాసంలో మంత్రి నారా లోకేశ్‌ను కలిశారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే రాకేష్ మృతి చెందడం తనను కలిచివేసిందని లోకేశ్ వారితో అన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. రాకేష్ కుటుంబ సభ్యులకు అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. వారి కుటుంబ నేపథ్యాన్ని అడిగి తెలుసుకున్నారు.

నేడు ఆర్టీసీ డ్రైవర్లకు నగదు పురస్కారాలు

తిరుపతి(ఆర్టీసీ), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా మసోత్సవాల ముగింపు సందర్భంగా శనివారం ఆర్టీసీ తిరుపతి డిపో గ్యారేజీ ఆవరణలో 36 మంది డ్రైవర్లకు ప్రమాద రహిత సర్వీసు నగదు పురస్కారం, ప్రశంసాపత్రాలు అందజేయనున్నారు. ముఖ్య అతిథులుగా ఆర్టీవో మురళీమోహన్, డీపీటీవో నరసింహులు హాజరుకానున్నారు. వీరి చేతుల మీదుగా అత్యధిక ప్రమాద రహిత సర్వీసు గలిగిన జిల్లాస్థాయిలో ముగ్గురిని, డిపో స్థాయిలో 33మంది డ్రైవర్లను సత్కరించనున్నారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటేష్ నాయక్, పొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి





జస్టిస్ వెంకటేష్ నాయక్ - వరదరాజుల రెడ్డి


శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 15 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

బుధవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.77 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 60,203

తలనీలాలు సమర్పించినవారు: 21,793





ప్రకృతి ఒడిలో సదాశివుడు

● అటు ఆధ్యాత్మికత..ఇటు ప్రకృతి రమణీయత


వడమాలపేట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): సహజ సిద్ధమైన జలపాతాలు, కొండ కోనల్లో సదాశివుని ఆలయం ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లుతోంది. వడమాలపేట సమీపంలోని సదాశివకోనలో వెలసిన ఈ ఆలయం దేవదాయ శాఖ పరిధిలో ఉంది. చుట్టూ ప్రకృతి అందాలు పరుచుకోవడంతో పర్యాటక కేంద్రంగా కూడా ఆలయప్రాంతం భాసిల్లుతోంది. పర్వదినాల్లో సమీప పరిసరాల నుంచే కాదు తమిళనాడు, కర్ణాటక నుంచి భక్తులు సైతం ఇక్కడకు వస్తుంటారు. జలపాతంలో స్నానమాచారించి స్వామివారిని దర్శించుకుంటారు. జలపాత స్నానం చేశాక తడిదుస్తులతో ప్రదక్షిణ చేసి స్వామిని దర్శిస్తే సంతాన ప్రాప్తి కలుగుతుందని దంపతులు విశ్వసిస్తారు. సదాశివకోన సమీపంలోనే కామాక్షి అమ్మవారి కోన ఉంది. మహామునులు పౌర్ణమి అమృత ఘడియల్లో జలపాత స్నానం చేసి గుహ ద్వారా శ్రీకాళహస్తిలోని వాయులింగేశ్వరుడ్ని దర్శించేవారని ఐతిహ్యం. శివరాత్రి, చిత్రాపౌర్ణమి, నవరాత్రులు,పౌర్ణమి తదితర వేడుకలకు భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది.

మహాశివరాత్రి ఏర్పాట్లు


శివరాత్రి సందర్భంగా చైర్మన్ జయచంద్రన్ ఆధ్వర్యంలో ఆలయాన్ని సుందరంగా అలంకరిస్తున్నారు. వేకువజామున లింగోద్భవ అభిషేకం అనంతరం సర్వదర్శనానికి భక్తులను అనుమతిస్తారు. సులభ దర్శనం కోసం క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. వ్యయ ప్రయాసలతో చేరుకునే భక్తులకు భోజన వసతి కల్పిస్తున్నారు. వడమాలపేట, పుత్తూరు, ఏర్పేడు మండలాల అన్నదాన సమాజాలు ఈ సేవలో తరిస్తాయి.



సదాశివకోనలో శివాలయం



సదాశివకోన జలపాతం



అమ్మవారి కోన జలపాతం





ఆలయానికి ఇలా వెళ్లాలి..

- వడమాలపేటకు సమీపంలో రామసముద్రం బైపాస్ నుంచి ఎనిమిది కిలోమీటర్లు కాలినడక మార్గం
- పుత్తూరు నుంచి బస్సుల ద్వారా నాగిలేరు, అక్కడ నుంచి కోనకు ఆరు కిలోమీటర్లు నడకమార్గం.
- ఏర్పేడు మండలం పాయల్ సెంటర్ నుంచి జీపులు, ట్రాక్టర్లు, మోటర్ బైక్‌ల ద్వారా 12 కిలోమీటర్లు ప్రయాణించాలి.

రాయలు నాటి శాసనం

సదాశివకోనలో బండమీద క్రీ.శ. 1554 నాటి శాసనం కనిపిస్తుంది. సదాశివకోనలో చెరువు తవ్వించిన అంశం, గుడిమల్లం పరశురామేశ్వరుడికి సంబంధించిన దానం ఈ శాసనంలో లిఖితమై ఉంది. శ్రీవీరప్రతాప వీర సదాశివదేవరాయలు తరఫున స్థానిక అధికారి(కార్యకర్త)గా పనిచేస్తున్న నరసింహ ఈ శాసనాన్ని వేయించారు. పాయల్ సెంటర్‌కి 15 కిలోమీటర్ల దూరంలో అడవిలో అమ్మవారి కోనతో ఒక బండమీద ఈ శాసనం ఉంది. తెలుగులో ఉన్న ఈ శాసనం మీది అక్షరాలు కనుమరుగవుతున్నాయి. దీని విలువ తెలియక రంగులు పూసేస్తున్నారు.



అమ్మవారి కోన లో బయల్పడిన పురాతన శాసనం

ఐదు రోజుల్లో రుయా రూపురేఖలు మారాలి

● ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ వెంకటేశ్వర్

● అత్యవసర విభాగం పనితీరుపై అసంతృప్తి

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): 'ఆస్పత్రిలో రోగులకు మౌలిక వసతులు కల్పించేది ఇలాగేనా... ఏసీలు పనిచేయడం లేదు.. లైట్లు కూడా వేయకుండా చీకటి గుహను తలపించేలా ఆస్పత్రిని మార్చేశారు.. అత్యవసర విభాగం ఇంత అధ్వానంగా ఉంటే మిగిలిన వాటి పరిస్థితి ఏమిటి' అంటూ కలెక్టర్ వెంకటేశ్వర్ రుయా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రుయాస్పత్రిని ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దాదాపు మూడు గంటల సేపు ప్రతి విభాగాన్నీ పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలు, మౌలిక వసతులను పరిశీలించారు. మొదటగా అత్యవసర విభాగాన్ని పరిశీలించారు. కనీసం లైట్లు కూడా వేయకుండా రోగులకు వైద్య సేవలు అందిస్తుండటం, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో అధికారులపై మండిపడ్డారు. వెంటనే అత్యవసర విభాగాన్ని మెరుగుపరిచే విధంగా చర్యలు చేపట్టి ఐదు రోజుల్లో రూపు రేఖలను పూర్తిగా మార్చాలన్నారు. అక్కడి నుంచి ఐసీయూ, ఆర్ఐసీయూ వార్డులను పరిశీలించారు. పనిచేయని ఏసీలు, ఫ్యాన్లు, లైట్లు ఉండకూడదని, విరిగిన మంచాలు, కుర్చీలు, కిటికీలు, తలుపులు వంటివి కూడా ఎక్కడా కనిపించకూడదని అన్నారు. అక్కడి నుంచి ఓపీ కేంద్రానికి వెళుతున్న క్రమంలో పాండూరుకు చెందిన జగ్గయ్య అనే రోగిని వారి కుటుంబ సభ్యులు స్ట్రెచర్‌పై నెట్టుకువెళుతుండటాన్ని గుర్తించారు. రోగులను ఇలాగే గాలికి వదిలేస్తారా.. తీసుకువెళ్లేందుకు సిబ్బంది లేరా అంటూ ఆయన వైద్యులను ప్రశ్నించారు. రోగులను ఇలా వైద్య పరీక్షలకు, ఓపీకి స్ట్రెచర్‌పై తీసుకువెళ్లకుండా అన్నీ ఒకే దగ్గర సమకూర్చే దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ల్యాబ్‌ను పరిశీలించి, ఏ రోజు పరీక్షల ఫలితాలు అదే రోజు అందించాలని, ఆలస్యం చేస్తే సహించేది లేదని అన్నారు. ఎంఆర్‌పై స్కానింగ్, జనరిక్, మందుల దుకాణాన్ని పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న రోగుల సహాయకుల భవనాన్ని పరిశీలించి, త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సెంట్రల్ డ్రగ్ స్టోర్, న్యూ సిటీ డయాగ్నోస్టిక్ సెంటర్‌ను పరిశీలించారు. ఆస్పత్రిలో ఎక్కడపడితే అక్కడ ఉద్యోగ సంఘాల క్యాలెండర్లు ఉండటంపై అసహనం వ్యక్తం చేస్తూ వాటి స్థానంలో సమాచార పోస్టర్లను అంటించాలన్నారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి కనకనరసారెడ్డి, రుయా సూపరింటెండెంట్ రవిప్రభు, డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్, ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ పార్థసారథిరెడ్డి, సీఎస్ఆర్ఎంవో సుబ్బలక్ష్మమ్మ, ఏఆర్ఎంవో హరికృష్ణ, ఏపీఎంఐడీసీ ఈఈ శివరామిరెడ్డి, హెచ్‌డీఎస్ సభ్యులు ఖాజా మొహిద్దీన్, సందీప్ పాల్గొన్నారు.



స్ట్రెచర్‌పై తీసుకువెళుతున్న రోగితో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

ఔటర్ రింగురోడ్డు టూ పాపవినాశనం

● రూ.40కోట్లతో నాలుగు లేన్ల రహదారి

తిరుమల, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ట్రాఫిక్ సమస్యలు తగ్గించేందుకు రూ.40 కోట్లతో ఔటర్‌రింగు రోడ్డు నుంచి పాపవినాశనంకు నాలుగులైన్ల రోడ్డు నిర్మాణానికి టీటీడీ పూనుకుంది. పాపవినాశనం తీర్థం, ఆకాశగంగ, జపాలి ఆంజనేయస్వామి ఆలయం, వేణుగోపాల స్వామి ఆలయాలకు వెళ్లాలంటే నందకం సర్కిల్ లేదా ఆక్టోపస్ భవనం ముందు నుంచి గోగర్భం డ్యాం మీదుగా వెళ్లాలి. గోగర్భం డ్యాం నుంచి పాపవినాశనం వరకు రెండులైన్ల రోడ్డు మాత్రమే ఉండటంతో వాహనాల రాకపోకలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విశేష పర్వదినాలు, వారాంతాల్లో సర్వదర్శన క్యూలైన్ ఆక్టోపస్ సర్కిల్ దాకా వ్యాపిస్తోంది. దీంతో వాహనాల రాకపోకలతో సమస్యలు వస్తున్నాయి. ఇందుకు పరిష్కారంగా నాలుగు లేన్ల రహదారిని ప్రతిపాదించారు.

తొలి దశలో..

తొలిదశలో వాహనాలు గోగర్భం డ్యాం మీదుగా వెళ్లే అవసరం లేకుండా ఔటర్ రింగ్‌రోడ్డు నుంచి క్షేత్రపాలకుని ఆలయం మీదుగా మఠాలు, డంపింగ్‌యార్డు, నేపాలి చెక్‌పోస్టుకు చేరుకునేలా రోడ్డు నిర్మాణం పనులు మొదలు పెట్టారు. ఔటర్ రింగు రోడ్డు నుంచి మఠాల వరకు పాచికాల్వ ఉండటంతో వంతెన నిర్మించనున్నారు.

రెండో దశలో..

నేపాలి చెక్‌పోస్టు నుంచి ఆకాశగంగ వరకు ప్రస్తుతమున్న రెండు లైన్ల రోడ్డును నాలుగులైన్ల రోడ్డుగా విస్తరించే పనుల్లో భాగంగా రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెట్లను తొలగించి సర్వే చేస్తున్నారు. ఆకాశగంగ నుంచి అటవీ భూములు కావడంతో అనుమతులు కోరారు.



పాపవినాశన మార్గంలోని పార్వేటమండపం వద్ద రోడ్డు విస్తరణకు జరుగుతున్న సర్వే

పోలీసులమని చెప్పి నగలు ఎత్తుకెళ్లారు

భాకరాపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పోలీసులమని మాయ మాటలు చెప్పిన గుర్తు తెలియని వ్యక్తులు ఓ జంట వద్ద బంగారు నగలు ఎత్తుకెళ్లిపోయిన ఘటన శుక్రవారం చిన్నగొట్టిగల్లు మండలంలో చోటుచేసుకుంది. భాకరాపేట ఎస్ఐ రాఘవేంద్ర కథనం మేరకు.. రొంపిచెర్ల మండలం గెర్లపల్లెకు చెందిన సుబ్రహ్మణ్యం శెట్టి భార్య భారతితో కలిసి ద్విచక్ర వాహనంలో చిన్నగొట్టిగల్లు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించుకుని స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యంలో ఎండపల్లెవారిపల్లె వద్దనున్న పెట్రోలు బంకు వద్ద వాహనాన్ని ఆపిన కొంతమంది తాము పోలీసులమని, బంగారు నగలు వేసుకుని ద్విచక్ర వాహనంలో తిరగడం ప్రమాదకరమని, నగలను తీసి భద్రంగా పెట్టుకోవాలని సూచిస్తూ ఒక పేపరు అందించారు. సుబ్రహ్మణ్యం శెట్టి తన చేతిలోని ఉంగరం, భార్య మెడలో ఉన్న బంగారు చైనును ఆ పేపర్‌లో చుట్టి పెట్రోలు ట్యాంకు కవర్‌లో పెట్టుకుంటూ ఉండగా తామే పొట్లం కట్టి ఇస్తామని తీసుకున్నారు. ఆ పొట్లాన్ని ట్యాంకు కవర్‌లో పెట్టినట్లు నటించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. వారు వెళ్లిపోయిన తర్వాత ట్యాంకు కవరును పరిశీలించిన సుబ్రహ్మణ్యం శెట్టి తాము మోసపోయినట్లు గ్రహించి భాకరాపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. 34 గ్రాముల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. భాకరాపేట పోలీసులు సీసీ పుటేజీ ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లక్ష్మీరెడ్డిపై కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): జనసేన నేత కిరణ్‌రాయల్ ఫిర్యాదు మేరకు లక్ష్మీరెడ్డిపై తిరుపతి రూరల్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. రూరల్ సీఐ చిన్నగోవిందు తెలిపిన ప్రకారం.. తన ఫొటోలను లక్ష్మీరెడ్డి, వైసీపీ నేత పసుపులేటి సురేష్ మార్ఫింగ్ చేశారని కిరణ్‌రాయల్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. లక్ష్మికి ఇవ్వాల్సిన రూ.35 లక్షలు ఇచ్చినా, మరో రూ.90 లక్షలు ఇవ్వాలని లేకపోతే పరువు తీస్తానని బెదిరిస్తోందంటూ కిరణ్‌రాయల్ ఫిర్యాదు చేశారు. దీనిపై సెక్షన్లు 308,(3), 351(2)తో పాటు బీఎన్ఎస్ యాక్టు 66(డి) ఐటీ యాక్టు కింద కేసు నమోదు చేశారు.

బుక్‌స్టాల్‌పై దాడి కేసులో నిందితుల అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): తిరుపతి పుస్తక ప్రదర్శనలో విశాలాంధ్ర బుక్ స్టాల్‌పై దాడి ఘటనలో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి 41 నోటీసు ఇచ్చినట్లు అలిపిరి సీఐ నాగార్జునరెడ్డి శుక్రవారం చెప్పారు. 41 నోటీసు ఇచ్చిన వారిలో తుమ్మల ఓంకార్, కిరణ్‌కుమార్, సురేష్‌నాయక్ ఉన్నారన్నారు. వీరితో పాటు దాడిలో పాల్గొన్న రమేష్‌బాబు, మరో నలుగురి కోసం గాలిస్తున్నారు.

ఎర్రచందనం నిందితుడికి ఐదేళ్ల జైలు

● రూ.ఆరు లక్షల జరిమానా విధించిన న్యాయమూర్తి

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష. రూ 6 లక్షల జరిమానా విధిస్తూ శుక్రవారం తిరుపతి ఎర్రచందనం అదనపు జిల్లా న్యాయమూర్తి నరసింహమూర్తి తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. తమిళనాడు విల్లుపురం జిల్లాకు చెందిన జయపాల్‌ను ముంగిలిపట్టు బీటు పరిధిలో ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడుతుండగా గతంలో టాస్క్‌ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించి నేరం రుజువు కావడంతో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ ఆరు లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. అనంతరం నిందితుడ్ని నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు.

18న దక్షిణాది రాష్ట్రాల డీజీపీల సమావేశం

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): దేశంలో తీవ్రవాదం, నక్సలిజాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించి, అవసరమైన నిర్ణయాలు తీసుకోవడానికి వీలుగా ఈ నెల 18న తిరుపతి కేంద్రంగా దక్షిణాది రాష్ట్రాల డీజీపీల సమావేశం నిర్వహించనున్నారు. తమిళనాడు, ఆంధ్ర, తెలంగాణా, కేరళ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన డీజీపీలు, ఉన్నత స్థాయి అధికారులు హాజరుకానున్నారు. సంవత్సరానికి రెండుసార్లు జరిగే సమన్వయ కమిటీ సమావేశం ఈసారి తిరుపతి వేదికగా జరగనుంది. గతంలో 2021 నవంబరు 14న తిరుపతిలో ఈ సమావేశం జరిగింది.

ఆర్టీసీలో డ్రైవర్ల కొరత



ఆర్టీసీ అధికారులతో సమీక్షిస్తున్న డీపీటీవో నరసింహులు

తిరుపతి(ఆర్టీసీ), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏపీఎస్ ఆర్టీసీ డ్రైవర్ల కొరత తీవ్రంగా కనిపిస్తోంది. ఉన్న వారిలోనూ పలువురు సెలవు పెడుతుండడంతో పూర్తిస్థాయిలో బస్సులు రోడ్డెక్కే పరిస్థితి ఉండడం లేదు. ఈ క్రమంలో అధికారులు ప్రత్యామ్నాయంపై దృష్టి సారించారు. తక్షణ చర్యలలో భాగంగా ఆన్‌కాల్ డ్రైవర్ల ద్వారా గట్టెక్కేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆయా డిపో మేనేజర్ల పరిధిలో ఆన్‌కాల్ డ్రైవర్ల నియామకానికి దరఖాస్తు చేసుకోవాలని డీపీటీవో జి.నరసింహులు ఔత్సాహికులను కోరారు. శిక్షణ ఇచ్చి, సర్టిఫికెట్స్, ఫిట్‌నెస్‌లలో పాసైన డ్రైవర్లను వెంటనే విధుల్లోకి తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు.

300మంది ఆన్‌కాల్ డ్రైవర్లకు అవకాశం

జిల్లాలోని 11డిపోల పరిధిలో ఆర్టీసీ సొంత బస్సులు 726 ఉన్నాయి. వీటిని సజావుగా నడపాలంటే 1,830మంది డ్రైవర్లు అవసరం. ప్రస్తుతం అందుబాటులో ఉన్న డ్రైవర్లు 1,701మంది. 129మంది తక్కువగా ఉన్నారు. అంతేకాకుండా అందుబాటులో ఉన్న డ్రైవర్లు కూడా అనివార్య కారణాలతో సెలవు పెడుతున్నారు. ప్రస్తుతం బస్సులన్నీ రోడ్డెక్కాలంటే 300మంది ఆన్‌కాల్ డ్రైవర్లు అవసరం. ఇప్పట్లో శాశ్వత డ్రైవర్ల నియామకాలు కనిపించడం లేదు కాబట్టి ఆన్‌కాల్ డ్రైవర్ల ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. 2014 తర్వాత ఆర్టీసీ డ్రైవర్ల నియామకం జరగలేదు. గడిచిన పదేళ్లలో డ్రైవర్ల ఉద్యోగ విరమణ, ఇతర కారణాలతో ఖాళీల సంఖ్య క్రమేణా పెరుగుతోంది.

'జిల్లాలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కసరత్తు చేస్తున్నాం. ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఇదే విషయమై ప్రధానంగా వినతులు వచ్చాయి. ఇబ్బడిముబ్బడిగా నోషనల్ ఖాతాలోకి వెళ్లిన హక్కుదారుల ఆస్తులకు శాశ్వత పరిష్కారం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం' అని తిరుపతి ఆర్డీవో రామ్మోహన్ అన్నారు. ఇంకా పలు విషయాలపై ఆయనతో ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కసరత్తు

● తిరుపతి ఆర్డీవో రామ్మోహన్

ఫటా ఫట్



? రెవెన్యూ సదస్సుల్లో ఎలాంటి ఫిర్యాదులొచ్చాయి

! తిరుపతి డివిజన్ పరిధిలో నెల రోజులపాటు నిర్వహించిన రెవెన్యూ సదస్సులను ప్రజలు వినియోగించుకున్నారు. ఎక్కువగా ఆర్వోఆర్ (రికార్డ్ ఆఫ్ రైట్స్) కేసులు వచ్చాయి. అంటే పట్టాదారు పాసు పుస్తకాలు ఆన్‌లైన్లో కావాలని, నిషేధిత జాబితా నుంచి తొలగించాలని, దారిలేక ఇబ్బందులు పడుతున్నామని, సర్వే సమస్యలు వంటివి వచ్చాయి. వాటిని జేసీ లాగిన్‌లో పెట్టాం.

? భూ కబ్జాలపై ఫిర్యాదులు చేశారా

! భూకబ్జా అంటే ఎలాంటి డాక్యుమెంటు లేకుండా వేరొకరి స్థలాన్ని ఆక్రమించుకోవడం. అయితే సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదులను పరిశీలిస్తే ఒకే స్థలానికి ఇద్దరు, ముగ్గురు మాదంటే మాదంటూ డాక్యుమెంట్లు తీసుకొస్తున్నారు. అదేవిధంగా కుటుంబ సభ్యులే భాగపరిష్కారం సక్రమంగా చేసుకోని వారు వస్తున్నారు. వీటిని భూకబ్జా అని అనలేం. ఇరువురి డాక్యుమెంట్లను పరిశీలించి, క్షేత్రస్థాయి సందర్శన, సర్వేతో భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం.

? 22ఏ సమస్యకు పరిష్కారం జరిగేనా

! ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా రెవెన్యూ, దేవదాయ శాఖవారు కొన్ని సర్వే నంబర్లను గ్రామాల వారీగా నిషేధిత జాబితాలో చేర్చుతూ (22ఏ) 2007లో ఆయా పరిధిలోని సబ్ రిజిస్ట్రార్లకు పంపారు. ఆ జాబితాలో పొరబాటున ఎవరి ఆస్తులైన నమోదైవుంటే త్వరలోనే వాటికి విముక్తి కలుగనుంది. గతంలో రిజిస్టరైన ఆస్తులు ఆ తర్వాత కాలేదంటే ప్రధాన కారణం 22ఏ. పట్టాల్యాండ్‌ను పొరబాటునపెట్టినా, మాజీ సైనికుల కోటా కిందనో, 1954 ముందు చుక్కల భూమి ఉన్న కేసుల్లో ఎన్వోసీలు ఇచ్చివుంటే వాటికి త్వరలోనే 22ఏ నుంచి తొలగించేందుకు ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు.

? నోషనల్ ఖాతాలోకి ఇబ్బడిముబ్బడిగా యజమానుల ఆస్తులు వెళ్లడమేంటి

! చంద్రగిరి నియోజకవర్గంలో ఇవి ఎక్కువగా ఉన్నాయి. ముఖ్యంగా పాకాల పరిధిలో కొన్ని గ్రామాలు నోషనల్ ఖాతాలో ఉన్నాయి. ఒక రైతుకు మ్యానువల్‌గా ఉన్నటువంటి 1బీ, అడంగల్‌ను ఆన్‌లైన్ చేయమని 2010-11లో చెప్పారు. చాలా మంది రైతులకు డాక్యుమెంట్ లేకపోవడమో, మ్యుటేషన్ చేసుకోవడంలో లింక్ డాక్యుమెంట్ లేకపోవడం, 1బి అడంగల్ దొరక్కపోవడం వలన టెంపరరీగా ఒక నెంబరు ఇచ్చివుంటారు. అదే నోషనల్ ఖాతా. కానీ భూమి వాళ్ల స్వానుభవంలోనే ఉంటుంది. ఇప్పుడు దానిని రెగ్యులర్ చేయడానికి దరఖాస్తులు వస్తున్నాయి. వాటిని పరిశీలించి, జేసీకి నివేదిక ద్వారా వివరించాం.

? పేరెంట్స్ ప్రొటెక్షన్ చట్టం అమలు ఎలా ఉండనుంది

! ఇది పాతదే. తల్లిదండ్రుల సంరక్షణ చట్టం 2007లో సెక్షన్ 23 ప్రకారం పేరెంట్స్‌ను పట్టించుకోని పిల్లలకు వారు పంచిచ్చిన ఆస్తులను తిరిగి తల్లిదండ్రులకే హక్కులు కల్పించడమే ఈ చట్టం ఉద్దేశం. ఇది తల్లిదండ్రుల సంరక్షణ కోసం తీసుకొచ్చిన చట్టం. ఆదరణకు నోచుకోని తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే విచారించి ఆ ఆస్తిపై పిల్లల హక్కును రద్దు చేసి, రిజిస్ట్రేషన్ హక్కులు కూడా మార్చి వారికి అప్పజెబుతాం. తల్లిదండ్రులను చూడాల్సిన బాధ్యత పిల్లలపై ఉంది.

? డివిజన్లో ఇసుక పాలసీ ఎలా నడుస్తోంది

! స్థానిక అవసరాలకు వాగులు, వంకలు, చెరువుల్లో దొరికే ఇసుక వాడుకోవచ్చు. మిషనరీ, టిప్పర్లు పెట్టి అడ్డగోలుగా దోచుకునేందుకు అనుమతి లేదు. ఇసుక తీసుకెళ్లేవారు పర్మిట్ తీసుకోవాల్సి ఉంటుంది. తిరుపతి డివిజన్‌కు సంబంధించి అవిలాల, కాటన్‌మిల్లు ప్రాంతంలో స్టాక్ పాయింట్లు ఉన్నాయి. అక్కడ కొనుగోలు చేసి తీసుకెళ్లవచ్చు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

అపాచీ బస్సు, లారీ ఢీ


ప్రమాదంలో దెబ్బతిన్న బస్సు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని మన్నారుపోలూరు క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం అపాచీ కంపెనీకి కార్మికులను తీసుకెళ్లే బస్సు, లారీ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కార్మికులకు ఎటువంటి గాయాలు కాలేదు. తుంగమడుగు, మంగానెల్లూరు నుంచి తడ మండలం మాంబట్టు పారిశ్రామికవాడలో ఉన్న అపాచీ పరిశ్రమకు 52 మంది కార్మికులతో వెళ్తున్న బస్సు సూళ్లూరుపేట జాతీయ రహదారిపై మన్నారుపోలూరు క్రాస్ రోడ్డు వద్ద చెన్నై నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న లారీని ఢీకొంది. ఈ ఘటనలో బస్సు ముందుభాగం నుజ్జునుజ్జు అయింది. కార్మికులకు ఎటువంటి ప్రమాదం జరగలేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హెల్మెట్ ధరించకుంటే కేసులు


ద్విచక్ర వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ శివశంకర్

డక్కిలి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడిపితే జరిమానా విధిస్తామని ఎస్ఐ శివశంకర్ హెచ్చరించారు. శుక్రవారం డక్కిలిలో రాపూరు - వెంకటగిరి మార్గంలో వాహనాలను తనిఖీ చేశారు. హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. రెండోసారి పట్టుబడితే జరిమానాతో పాటు కేసులు నమోదు చేసి లైసెన్సు రద్దు చేసేలా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ చెప్పారు.

చిన్నారుల సంరక్షణ, పోషకాహారం


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో జగదీష్‌బాబు

డక్కిలి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): డక్కిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ కాంప్లెక్స్‌లో శుక్రవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ బీ పఢాయి బీ (చిన్నారుల సంరక్షణ, పోషకాహారం) కార్యక్రమంపై ఎంఈవోలు జగదీష్ బాబు, ఎంఈవో వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పరిమళ అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు ఆరోగ్య సంరక్షణ, పోషకాహారం, బాల్య విద్యపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కోట: మండల పరిధిలోని చిట్టేడు, కోట బాలుర ఉన్నత పాఠశాలలో పోషణ్ బీ పఢాయి బీపై అంగన్‌వాడీ వర్కర్లకు అవగాహన కల్పించారు. సీడీపీవో మునికుమారి, సూపర్ వైజర్లు కవిత మాట్లాడుతూ చిన్నారులను విధిగా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలన్నారు. అదే విధంగా ప్రతి తల్లి, బిడ్డ, ఆరోగ్యంగా ఉండేందుకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలన్నారు.

చిల్లకూరు: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సీడీపీవో మెహబూబి అంగన్‌వాడీల్లో అందించే పోషకాహారంపై సిబ్బందికి అవగాహన కల్పించారు. సీడీపీవో మాట్లాడుతూ అంగన్‌వాడీ సిబ్బంది బాలింతలకు, గర్భిణులకు అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చే పోషక ఆహారం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు రేణుకమ్మ, శివజ్యోతి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టాఫీసుల ప్రైవేటీకరణను విరమించుకోండి



ధర్నా నిర్వహిస్తున్న పోస్టల్ ఉద్యోగులు

గూడూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పోస్టాఫీసులను ప్రైవేటీకరించేందుకు కేంద్రప్రభుత్వం చేస్తున్న సన్నాహాలను విరమించుకోవాలని పోస్టల్ ఉద్యోగుల సంఘం నాయకులు అన్నారు. శుక్రవారం స్థానిక పోస్టాఫీసు వద్ద ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పోస్టల్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుండా ప్రైవేటీకరణకు చర్యలు చేపడుతోందన్నారు. ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఎస్‌రాజు, గోపాల్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీపై నేడు సదస్సు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సైబర్ సెక్యూరిటీ అంశంపై పద్మావతి మహిళా యూనివర్సిటీలో శనివారం సదస్సు నిర్వహించనున్నారు. సత్యన్న సేన ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు ఇందిరా ప్రియదర్శినీ ఆడిటోరియంలో ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధనరాజు పాల్గొంటారని సత్యన్న సేన సంస్థ అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం తెలిపారు. విద్యార్థులు, ఉద్యోగులు సైబర్ నేరాలకు గురికాకుండా ఉండేలా అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

ఆలోచల్లో మార్పుతో మానసిక రుగ్మతలకు చెక్

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మానవుడి ఆలోచనా విధానంలో మార్పు ద్వారా మానసిక రుగ్మతలకు చెక్ పెట్టవచ్చని ప్రముఖ సైకాలజిస్ట్ ఎస్‌బీ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఎమ్మార్‌పల్లెలోని యూత్ హాస్టల్‌లో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మన మనసే మానసిక రుగ్మతలకు కారణమని, ఆలోచనా విధానం కష్ట సుఖాలకు వేదికగా మారుతుందని వివరించారు. వృద్ధాప్యంలో వీలైనంత వరకు సుఖ జీవనాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, జిల్లా కార్యదర్శి రామలింగారెడ్డి, తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు మదన్ మోహన్‌రెడ్డి మాట్లాడారు. గౌరవ సలహాదారు ఎస్ఎస్ రవి, సుస్వర, నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు టీడీపీ కార్యాలయంలో గ్రీవెన్స్ డే

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం గ్రీవెన్స్ డే నిర్వహించనున్నట్లు సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తెలిపారు. ఉదయం 10గంటల నుంచి అర్జీలు స్వీకరిస్తామని, నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రజలు తమ సమస్యల విన్నవించవచ్చని చెప్పారు.

15 నుంచి నీలకంఠాలయ కుంభాభిషేకం

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - తుమ్మూరులో వెలసిన గంగా కామాక్షీదేవి సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 15 నుంచి జీర్ణోద్ధరణ, అష్టబంధన, మహా కుంభాభిషేకాలు నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు.

పన్నులను సకాలంలో చెల్లించాలి

గూడూరు అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలు పన్నులను సకాలంలో చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ వెంకటేశ్వర్లు కోరారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మున్సిపాలిటీ పరిధిలోని ఆస్తి, కొళాయి, ఖాళీ స్థలాలు, ట్రేడ్ లైసెన్స్ పన్నులను సకాలంలో చెల్లించాలని కోరారు.

16న హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక

చిల్లకూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో ఈనెల 16వ తేదీన రాష్ట్రస్థాయి జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీలకు ఉమ్మడి నెల్లూరు జిల్లా జట్టును ఎంపిక చేయనున్నట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ పీడీ శ్రీరేష్ తెలిపారు. వివరాలకు 9704827095 నంబరును సంప్రదించాలన్నారు.



గొర్రెపల్లిగుంట ప్రధాన రహదారి - కాలనీలో అధ్వానంగా ఉన్న వీధి

అభివృద్ధికి ఆమడ దూరంలో గొర్రపల్లిగుంట గిరిజనకాలనీ


నిరుపయోగంగా ఉన్న తాగునీటి ట్యాంక్

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణ కేంద్రానికి కూతవేటు దూరం... మండలంలో మేజర్ పంచాయతీ అయిన పుదూరులో ఉన్న గొర్రెపల్లిగుంట కాలనీలోని గిరిపుత్రులు సమస్యల లోగిళ్లలో జీవనం సాగిస్తున్నారు. గొర్రెపల్లిగుంట కాలనీలో 100 గిరిజన కుటుంబాలు ఉన్నారు. ఎస్టీ గ్రాంట్ కింద మంజూరైనా రెండు సిమెంట్ రోడ్లు తప్పితే కాలనీలో వీధులన్నీ మట్టిరోడ్లతో దర్శన మిస్తున్నాయి. చినుకుపడితే చిత్తడిగా ఉండే ఆ రోడ్లపై రాకపోకలు సాగించేందుకు గిరిపుత్రులు సర్కస్ ఫీట్‌లు చేయాల్సి వస్తోంది. ముఖ్యంగా అనారోగ్యం భారిన పడిన వృద్ధులను, గర్భిణులను ఆస్పత్రు లకు తీసుకువెళ్లాలన్నా నానాపట్లు పడుతున్నారు. డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. కాలనీలో రక్షిత మంచినీటి పథకం లేకపోవడంతో బావి నీరే జీవనాధారం. 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో సీపీడబ్ల్యూఎస్ స్కీమ్ ద్వారా నాయుడు పేట నుంచి గొర్రెపల్లిగుంట కాలనీకి తాగునీరును సరఫరా చేసేందుకు పైపులైన్‌లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పైపులైన్‌లు మరమ్మతులకు గురికావడంతో నీటి సరఫరా ఆగిపోయింది. దీంతో కాలనీ సమీపంలో ఉన్న బావి నుంచి మరో పైపులైన్ వేసి నీరందిస్తున్నారు. ఆ నీరు రంగుమారడంతో తాగలేక ఇబ్బందులు పడుతున్నామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీ ప్రధాన రహదారిని సిమెంట్ రోడ్డుగా మార్చడంతో పాటు డ్రైనేజీ కాలువలు నిర్మించాలని, తాగునీటి సమస్య పరిష్కరించాలని గిరిపుత్రులు కోరుతున్నారు.




దుస్థితిలో తహసీల్దార్ కార్యాలయం - దెబ్బతిన్న స్తంభం

శిథిలావస్థలో ప్రభుత్వ కార్యాలయాల భవనాలు

బిక్కుబిక్కుమంటున్న సిబ్బంది

బాలాయపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రధానంగా తహసీల్దార్ కార్యాలయం, పశువైద్యశాల భవనాలు కూలిపోయే స్థితిలో ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వం సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, గ్రామీణ ఆరోగ్య కేంద్రాల భవన నిర్మాణాలపై పెట్టిన శ్రద్ధ దుస్థితికి చేరుకున్న కార్యాలయాలపై చూపలేదు. రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు గది, వరండాలో పైకప్పు తరచూ పెచ్చులూడి పడుతోంది. దీంతో పక్కనే ఉన్న కమ్యూనిటీ భవనంలోకి తహసీల్దారు కార్యాలయాన్ని తాత్కాలికంగా మార్చారు. అయితే ఆ భవనం ఇరుకుగా ఉండడంతో ఆర్ఐ, సర్వేయర్, వీఆర్వోలు శిథిలావస్థకు చేరిన భవనంలో విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు కార్యాలయంలో పైకప్పు పెచ్చులూడి పడడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని కార్యాలయానికి వచ్చే ప్రజలతో పాటు సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. అలాగే పశువైద్యశాల పురాతనమైన భవనం కావడంతో దుస్థితికి చేరుకుని కూలేస్థితిలో ఉంది. పాడిరైతులు పశువులను తీసుకుని పశు వైద్యశాలకు రావాలంటే భయపడుతున్నారు. చిన్నపాటి వర్షం వచ్చినా భవనం ఉరుస్తూ లోపలికి నీళ్లు వస్తుండడంతో సామగ్రి తడిసి ముద్దవుతోందని సిబ్బంది వాపోతున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి దుస్థితిలో ఉన్న ప్రభుత్వ భవనాల స్థానంలో కొత్తవి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

డక్కిలి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): డక్కిలిలోని బాలయోగి బాలకల గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నాగమణి తెలిపారు. విద్యార్థులు మార్చి 6వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 6వ తేదీ ఉదయం 5వ తరగతికి, మధ్యాహ్నం ఇంటర్మీడియాట్ విద్యార్థులకు ప్రవేశ పరీక్ష ఉంటుందని చెప్పారు.

చికిత్స పొందుతూ కార్మికుడి మృతి

పెళ్లకూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నేపల్లిలోని ఎంఎస్ అగర్వాల్ స్టీల్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుడు చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.... జనవరి 1న ఎంఎస్ అగర్వాల్ స్టీల్ పరిశ్రమలో బాయిలర్ పేలిన ఒకరు మృతి చెందగా ఆరుగురు గాయపడ్డారు. క్షతగాత్రులకు చెన్నైలోని కీలపాకం ఆస్పత్రిలో చికిత్స అందించారు. తీవ్రంగా గాయపడిన ఉత్తరప్రదేశ్ రాష్ట్రం రాంపూర్‌కు చెందిన సోను మహమ్మద్ (27) గురువారం సాయంత్రం ఆస్పత్రిలో మృతి చెందాడని, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

అమరవీరుల త్యాగాలను గుర్తించుకోవాలి



అమరవీరుల చిత్రపటాలకు బీజేవైఎం నాయకులు, విద్యార్థుల నివాళి

గూడూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): శత్రువుల నుంచి దేశాన్ని కాపాడేందుకు ప్రాణాలను ఫణంగా పెట్టి అమరులైన సైనికుల త్యాగాలను గుర్తించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మనోజ్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో బీజేవైఎం ఆధ్వర్యంలో పుల్వామా ఘటనలో అమరులైన సైనికుల చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో దామోదర్, శివశంకర్, కార్తీక్, ప్రణయ్, నవీన్, కిరణ్, ప్రదీప్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి పరీక్ష శిబిరం

దొరవారిసత్రం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీనివాసపురంలో ఉన్న వాసమ్మ ఆశ్రమంలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అరవింద ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వాటర్ ప్లాంటు ప్రారంభం

చిల్లకూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏరూరు గ్రామంలో శుక్రవారం గ్రామానికి చెందిన అఖిల్‌రెడ్డి జ్ఞాపకార్థం సుధీర్‌రెడ్డి సహకారంతో ఉచిత మినరల్ వాటర్ ప్లాంటును ప్రారంభించారు. గ్రామస్తులకు శుద్ధనీటిని ఉచితంగా అందించాలని తమ కుమారుడు జ్ఞాపకార్థం ఆర్వోప్లాంటును ఏర్పాటు చేశామని సుధీర్ రెడ్డి తెలిపారు.

సంజీవయ్య సేవలు చిరస్మరణీయం


సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ ధనలక్ష్మి, ఎంపీడీవో సురేష్‌బాబు తదితరులు

నాయుడుపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య సేవలు చిరస్మరణీయమని ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి అన్నారు. నాయుడుపేట మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎంపీపీతో పాటు ఎంపీడీవో సురేష్‌బాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిబ్బంది ఆనంద్, రవికుమార్, సత్యనారాయణ, కృష్ణమాంబ తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సమస్యపై దృష్టి పెట్టండి

చిట్టమూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): వేసవికిలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం ఎంపీడీవో మనోహర్ గౌడ్ ఆధ్వర్యంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. మండలంలోని తాగునీటి ఎద్దడి ఏర్పడే గ్రామాలను గుర్తించి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు విజయలక్ష్మి, జట్పీటీసీ సభ్యుడు వెంకటయ్య పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం


నిందితుడితో ఎక్సైజ్ సీఐ ప్రసాద్, సిబ్బంది

కోట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్లపూడిలో బెల్టుషాపుపై ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. 11 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని, బెల్టుషాపు నిర్వాహకుడు ప్రభాకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ ప్రసాద్ తెలిపారు.

పుల్వామా అమర వీరులకు నివాళి


ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

కోట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పుల్వామా దాడిలో వీరమరణం పొందిన జవాన్‌లకు శుక్రవారం ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ విద్యార్థులు నివాళులర్పించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్‌సీసీ క్యాడెట్లు, విద్యార్థులు కళాశాల నుంచి విద్యానగర్ గాంధీబొమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు.

రీ సర్వేపై సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు జయజయరావు, డివిజనల్ సర్వే ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయుడు


కోట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో రీ సర్వేపై విలేజ్ సర్వేయర్లతో శుక్రవారం సమీక్ష జరిగింది. తహసీల్దారు జయజయరావు, డివిజనల్ సర్వే ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం ఒక్కొక్క మండలానికి ఒక్కో రెవెన్యూ గ్రామాన్ని మోడల్ విలేజ్‌గా ఎంచుకుని రీ సర్వే చేయడం జరుగుతుందన్నారు. కోట మండలంలో అల్లంపాడు గ్రామాన్ని మోడల్ విలేజ్‌గా ఎంచుకొని సర్వే చేస్తున్నామని చెప్పారు. ఆ గ్రామంలో రైతుల భూములను సమగ్రంగా సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు.

సీఎం చంద్రబాబుకు కల్లుగీత కార్మికుల ధన్యవాదాలు

గూడూరు అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కల్లుగీత కార్మికులకు మద్యం దుకాణాల మంజూరులో పది శాతం రిజర్వేషన్ కేటాయించి అమలు పరిచిన సీఎం చంద్రబాబుకు జిల్లా గౌడ సంక్షేమ సంఘ నాయకులు శుక్రవారం ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాజశేఖర్, నారాయణస్వామి, మోహన్, పురుషోత్తం, శ్రీనివాసులు, శ్రీరాములు, అంకయ్య, రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తానంకి నానాజీకి సైకత శుభాకాంక్షలు

చిల్లకూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నేత, పెంచలకోన ఆలయ మాజీ చైర్మన్ తానంకి నానాజీ పుట్టినరోజును పురస్కరించుకుని చిల్లకూరు మండలంలోని ఏరూరు గ్రామానికి చెందిన సైకతశిల్పి మంచాల సనత్‌కుమార్ శుక్రవారం గ్రామంలో నానాజీ సైకత శిల్పాన్ని రూపొందించి శుభాకాంక్షలు తెలిపారు.



షార్‌లో స్వచ్ఛత పఖ్వాడా



స్వచ్ఛత పఖ్వాడ కార్యక్రమంలో తొలి సంతకం పెడుతున్న షార్ డైరెక్టర్ రాజరాజన్, పక్కన షార్ ఉద్యోగులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లో శుక్రవారం డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ ఆధ్వర్యంలో స్వచ్ఛత పఖ్వాడ కార్యక్రమం నిర్వహించారు. షార్ ఉద్యోగుల నుంచి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా షార్ డైరెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమానికి షార్ ఉద్యోగుల అంకితభావాన్ని తెలియజేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, పరిశుభ్రతపై పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో షార్ కంట్రోలర్ శ్రీనివాసుల రెడ్డి, సీనియర్ ఉద్యోగులు పాల్గొన్నారు.

రోడ్డు బాగు చేయాలని నిరసన


లారీలను అడ్డుకొని నిరసన తెలుపుతున్న పునబాక గ్రామస్తులు

పెళ్లకూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రోడ్డు బాగు చేయాలంటూ మండలంలోని పునబాక గ్రామస్తులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. చెంబేడు క్రాస్ రోడ్డు నుంచి పునబాక ఆర్‌అండ్‌బీ రోడ్డు మీదుగా వెళ్తున్న మెగా సంస్థకు చెందిన లారీలను అడ్డుకున్నారు. మెటల్, గ్రావెల్, మట్టి తరలిస్తున్న వాహనాలతో రోడ్డు గుంతలమయంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు బాగుచేస్తామని మెగా సంస్థ ప్రతినిధులు హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

మాజీ ఎమ్మెల్యే ఎల్లసిరికి నివాళి


శ్రీనివాసులురెడ్డి చిత్రపటానికి ఆటో యూనియన్ నాయకుల నివాళి

గూడూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు గ్రామంలో శుక్రవారం రాపూరు మాజీ ఎమ్మెల్యే ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి వర్థంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఆటో యూనియన్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు శ్రీనివాసులురెడ్డి, హరి, శివకుమార్, శంకరయ్య, బాబు, ప్రసాద్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.